www.prajadeevena.com

ప్రజా దీవెన

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 10 | మంగళవారం | 17 నవంబర్ 2026 | పేజీలు : 04 వెల ₹ 5

"ఏ క్షణంలోనైనా సరే, అన్ని సంకల్పాలను వదిలేస్తే, మీరు మీ 'స్వయం'తో (ఆత్మశ్రీట) అనుసంధానమవుతారు; ఆ క్షణంలోనే ధ్యానం సంభవిస్తుంది."డబ్బును మీ జేబులోనో లేదా బ్యాంకు ఖాతా లోనో ఉంచుకోండి, కానీ మీ మనస్సులోనో లేదా హృదయం లో నో ఉంచుకోవద్దు.డబ్బును తప్పుడు చోట ఉంచినప్పుడే సమస్యలు మొదలవుతాయి.

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ



ఆత్మకథ అందుకే ఆవిష్కరణ

'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకాన్ని ఆవిష్కరించిన సోనియాగాంధీ
ఇందిర, రాజీవ్ హత్యల ప్రస్తావనతో భావోద్వేగం
అమ్మ నాలుగుసార్లు క్యాన్సర్‌ను జయించిందన్న రాహుల్
చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకుంటూ ఉద్వేగం
కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్, డీకే శివకుమార్ సహా పలువురు నేతలు

04

తన కుటుంబంపై ఏళ్ల తరబడి తప్పుడు ప్రచారం జరిగిందని, అందుకు తన వైపు నుంచి సమాధానం చెప్పాలనే ఉద్దేశంతోనే ఆత్మకథ రాసినట్లు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ వెల్లడించారు. తన కుటుంబ సభ్యులపై అనేక సంవత్సరాలుగా విమర్శలు, అసత్య ప్రచారాలు కొనసాగాయని, వాటికి తన జీవిత అనుభవాలే సమాధానంగా నిలుస్తాయని భావించి పుస్తక రూపంలో తన కథను ఆవిష్కరించానని చెప్పారు.





మనీలాలో మన మోదీ

మూడు రోజుల ఫిలిప్పీన్స్ పర్యటనకు చేరుకున్న భారత ప్రధాని
నేడు 23వ ఆసియాన్-భారత్ సదస్సుకు హాజరు
ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్‌తో కీలక భేటీ
వాణిజ్యం, పెట్టుబడులు, సముద్ర భద్రతపై చర్చలు
ప్రవాస భారతీయులతోనూ సమావేశమైన ప్రధాని

4

మూడు రోజుల పర్యటన నిమిత్తం భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాకు చేరుకున్నారు. సోమవారం మనీలా అంతర్జాతీయ విమానాశ్రయంలో అడుగుపెట్టిన ఆయనకు ఫిలిప్పీన్స్ అధికారులు, ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. సాంస్కృతిక కార్యక్రమాలతో భారత ప్రధానికి ఆహ్వానం పలికారు.

సమ్మక్క సారక్కకు నిరభ్యంతర పత్రం



నేడు చత్తీస్ ఘడ్ సీఎంతో రేవంత్ భేటీ

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి నయా రాయ్‌పూర్‌కు ముఖ్యమంత్రి
ఇప్పటికే అక్కడికి చేరుకున్న నీటిపారుదల శాఖ అధికారుల బృందం
ఎన్‌వోసీ లభిస్తే సీడబ్ల్యూసీ అనుమతుల కోసం మరోసారి డీపీఆర్ దాఖలు



ప్రజా దీవెన, హైదరాబాద్ : సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) బ్యారేజీకి అవసరమైన నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) సాధించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి మంగళవారం ఛత్తీస్‌గఢ్ రాజధాని నయా రాయ్‌పూర్‌కు వెళ్లనున్నారు. అక్కడ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్‌తో సమావేశమై ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు. ఇప్పటికే తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారుల బృందం నయా రాయ్‌పూర్‌కు చేరుకుంది. సమ్మక్కసాగర్ ప్రాజెక్టు సమగ్ర ప్రాజెక్టు

మిగతా 2 లో

తమ్మిడిశెట్టిపై తప్పుడు ప్రచారం తగదు



ప్రజాప్రయోజనాల కోసమే తమ్మిడిహట్టి మార్పు..
కాంగ్రెస్ హయాంలో అనుమతులకే ఏడేండ్ల జాప్యం
తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదనే విషయాన్ని గతంలోనే అసెంబ్లీ సాక్షిగా ఆధారాలతో వివరించా
నీళ్లు లేని చోట ప్రాజెక్టుప్రతిపాదన కాంగ్రెస్ తప్ప
నీటి లభ్యత ఉన్న ప్రాంతానికిప్రాజెక్టును మార్చి ఆ తప్పును నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సరిదిద్దింది
బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరహాలోనే ఉత్తమ్ కుమార్‌రెడ్డి కూడా వాస్తవాలను కప్పిపెట్టి అబద్ధాలు మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. ఇకనైనా ఉత్తమ్ అబద్ధాలు చెప్పడం మానుకోవాలని హితవుపలికారు.



సమ్మిటి సమస్యపై క్రిమినల్ కేసులు

శంషాబాద్‌లోని ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు ఫిర్యాదు
సమ్మిట్ నిర్వాహకులందరిపై క్రిమినల్ కేసులు పెట్టాలి
డీజీపీకి ఫిర్యాదు చేసిన రాంచందర్‌రావు

04

హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన భారత్ సమ్మిట్ వేదికపై ఇటలీ రాజకీయ నాయకుడు, యూరోపియన్ సోషలిస్ట్స్ పార్టీ సెక్రెటరీ జనరల్ జియాకోమో ఫిలిబెక్ కాంగ్రెస్‌కు మద్దతుగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు సోమవారం ఫిర్యాదు చేశారు.

అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పు



జీవితకాల జైలు శిక్షనూ సస్పెండ్ చేస్తున్నాం వారిని విడుదల చేయండి
బిల్కిస్‌బానో కేసులో ఇద్దరు దోషుల పిటిషన్‌పై సుప్రీంకోర్టు సంచలన ఉత్తర్వులు
దోషుల్లో ఒకరు వైకల్యంతో బాధపడుతున్నారు
వారి పిటిషన్‌లో వాస్తవాలు, చట్టపరమైన అంశాలను పరిశీలిస్తాం: న్యాయమూర్తులు
వారు ఘోరం చేశారు.. బెయిలివ్వొద్దు: సర్కార్

ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక కమిషన్

జస్టిస్ ఆశామీనన్ కమిటీకి ట్రాన్స్‌జెండర్ల వినతి

ప్రజా దీవెన, హైదరాబాద్: తమ సంక్షేమం కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌జెండర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు జస్టిస్ ఆశామీనన్ కమిటీని కోరారు. సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ ఆశా మీనన్ కమిటీ.. సోమవారం బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో దక్షిణాది రాష్ట్రాల ట్రాన్స్‌జెండర్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించింది. తెలంగాణ, కేరళ, కర్ణాటక, గోవా రాష్ట్రాలకు చెందిన 200 మందికి పైగా ట్రాన్స్‌జెండర్లు హాజరై, తమ స్థితిగతులను వివరించారు. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సంక్షేమానికి తెలంగాణలో మెరుగైన చర్యలు అమలవుతున్నాయని.. మైత్రీ క్లినిక్స్ ద్వారా వైద్య సేవలు అందిస్తున్న విధానం ఆదర్శనీయమని ట్రాన్స్‌జెండర్ల హక్కుల ఉద్యమకారులు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ట్రాఫిక్, మెట్రో, హైడ్రా లాంటి విభాగాల్లో ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగావకాశాలు కల్పించడాన్ని ఇతర రాష్ట్రాల ప్రతినిధులు కొనియాడారు. అయితే, తెలంగాణలోనూ మిగతా వారితో సమానంగా ట్రాన్స్‌జెండర్లకు అలవెన్సులు ఇవ్వడం లేదని.. ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకమేనని ఇక్కడి వారు చెప్పారు. ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం న్యాయ పోరాటం చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 300మంది ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకుంటే ఒక్కరికి కూడా మంజూరు కాలేదని వివరించారు. కేరళలో ట్రాన్స్‌జెండర్ల హక్కులు సరిగ్గా అమలు కావడం లేదని ఆ రాష్ట్రానికి చెందిన వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగిన సిఫారసులను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామని ఆశామీనన్ కమిటీ హామీ ఇచ్చింది. ఈ సమావేశంలో తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్, ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ సెల్, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డిమాండ్ పెరిగినా నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా

రబీలోనూ ఇలాగే కొనసాగాలి: డిప్యూటీ సీఎం భట్టి

ప్రజా దీవెన, హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రాష్ట్రంలో విద్యుత్తు సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్తు డిమాండ్ గరిష్ఠ స్థాయికి చేరినా ఇబ్బందులు లేకుండా సరఫరా చేయడంలో విద్యుత్తు సంస్థలు సమర్థంగా పనిచేస్తున్నాయని అభినందించారు. రానున్న రబీ సీజన్‌లోనూ రైతులు, గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు నిరంతరాయంగా విద్యుత్తు అందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్, సరఫరా నిర్వహణ, మౌలిక సదుపాయాల విస్తరణ, రానున్న రబీ సీజన్‌కు సన్నద్ధతపై ఆయన అధికారులతో చర్చించారు. అక్టోబరు 16న రికార్డు స్థాయిలో విద్యుత్తు డిమాండ్ 20,018 మెగావాట్లకు చేరుకుని గరిష్ఠ స్థాయిని నమోదు చేసిందని.. అయినప్పటికీ విద్యుత్తు సంస్థలు సమర్థంగా సరఫరా చేశాయని భట్టి చెప్పారు. రబీ సీజన్‌లో విద్యుత్తు డిమాండ్‌లో ఆకస్మిక పెరుగుదల సంభవించే పరిస్థితులను ముందుగానే అంచనా వేయాలన్నారు. ఏ ఒక్క వినియోగదారుడికీ విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

క్రిమియా వంతెనపై ఉక్రెయిన్ దాడి

రష్యా-క్రిమియా మధ్య రాకపోకలు బంద్

మాస్కో, నవంబరు 16: రష్యా, క్రిమియా మధ్య కీలక రవాణా మార్గమైన క్రిమియా వంతెనపై ఉక్రెయిన్ మరోసారి డ్రోన్ దాడికి పాల్పడింది. సోమవారం తెల్లవారుజామున కెర్చ్ జలసంధిపై ఉన్న యూర్‌పలోనే అతి పొడవైన (19 కిలోమీటర్లు) ఈ వంతెనను లక్ష్యంగా చేసుకున్నట్లు రష్యా అధికారులు వెల్లడించారు. దాడి నేపథ్యంలో వంతెనపై వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దాడిలో వంతెన స్వల్పంగా దెబ్బతిన్నట్లు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపారు. మరోవైపు ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ఉక్రెయిన్ ఏకంగా 1,300కు పైగా డ్రోన్లతో రష్యాపై దాడి చేసిందని, వాటిలో చాలా వరకు డ్రోన్లను కూల్చివేశామని ఆ దేశ రక్షణ శాఖ ప్రకటించింది. 2022లో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇదే అతిపెద్ద డ్రోన్ దాడిగా పేర్కొంది. ట్రంప్, పుతిన్, జిన్‌పింగ్‌లు ఈనెల 19న చైనాలో భేటీ కానున్న నేపథ్యంలో తాజా దాడి కలకలం రేపింది.

హిందుస్థాన్ ఏ ఒక్కరి సొత్తూ కాదు

పంజాబ్ గాయకుడు దిల్జీత్ దొసాంజ్

ఇండోర్, నవంబరు 16: హిందుస్థాన్ ఏ ఒక్కరి సొత్తూ కాదని, దేశ మట్టిలో అందరి రక్తం కలిసే ఉందని పంజాబీ గాయకుడు, నటుడు దిల్జిత్ దొసాంజ్ అన్నారు. ఈ నెల 15న మధ్యప్రదేశ్ ఇండోర్‌లో కచేరీ ప్రారంభిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కచేరీ జరగకుండా కొందరు అడ్డంకులు సృష్టించారని ఆయన గుర్తు చేశారు. ఇండోర్ మహాకాలుడి నేల అని, తనను రాకుండా ఎవ్వరూ అడ్డుకోలేరని ఆయన స్పష్టం చేశారు. అభిమానులను కలుసుకోకుండా తనను ఎవ్వరూ భయపెట్టలేరని ఆయన అన్నారు. కచేరీకి వారం ముందే మద్యం, మాదకద్రవ్యాలు, ఆయుధాల వాడకాన్ని ప్రోత్సహించేలా ఉన్న నాలుగు పాటలు పాడవద్దని ఆయనకు జిల్లా అధికారులు సూచించారు. చిన్నారులపై ప్రభావం చూపేలా ఉన్నాయంటూ గతంలో పంజాబ్-హర్యానా హైకోర్ట్ అభ్యంతరం వ్యక్తం చేయడాన్ని గుర్తు చేశారు. అయినా కూడా అధికారులను సూచనలు పట్టించుకోకుండా దొసాంజ్ పాడటం దుమారం రేపుతోంది.

నారాయణపేట మెడికల్ కాలేజీ హాస్టల్‌లో అగ్నిప్రమాదం

నారాయణపేట: నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ బాలికల హాస్టల్‌లో సోమవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో హాస్టల్ గదిలో ఉన్న ఏడుగురు విద్యార్థినులు సురక్షితంగా బయటపడగా.. వారికి సంబంధించిన స్టడీ మెటీరియల్స్, దుస్తులు, ట్యాబ్‌తో పాటు ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఓ ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న ఈ హాస్టల్‌లో సుమారు 60 మంది విద్యార్థినులు ఉంటున్నారు. చివరి సంవత్సరం విద్యార్థినులు ఉంటున్న రెండో అంతస్తులోని ఓ గదిలో ఈ ప్రమాదం జరిగింది. ఓ విద్యార్థిని వేడినీటి కోసం ఉదయం ఓ బకెట్‌లో హీటర్‌ను ఉంచగా.. అందులో విద్యుత్‌షాక్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఆ గది మొత్తం వ్యాపించాయి. అదే గదిలో నిద్రిస్తున్న ఇతర విద్యార్థినులు మేల్కొని వెంటనే సంబంధిత అధికారులు, సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ఘటనా స్థలాన్ని ఆర్డీవో రమేశ్, ప్రిన్సిపాల్ సంపత్ పరిశీలించారు. కాగా, హాస్టల్ సమస్యలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారుల నుంచి స్పందనలేదని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపిస్తూ విద్యార్థులతో కలిసి పెద్ద సంఖ్యలో వెళ్లి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

సమ్మక్క సారక్కకు నిరభ్యంతర పత్రం

మొదటి పేజీ తరువాయి

నివేదిక (డీపీఆర్)కు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)లోని అంతర్రాష్ట్ర విభాగం మినహా మిగతా డైరెక్టరేట్ల నుంచి అనుమతులు లభించాయి. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి ఎన్‌వోసీ సమర్పిస్తే ప్రాజెక్టుకు క్లియరెన్స్ ఇస్తామని సీడబ్ల్యూసీ ఇప్పటికే స్పష్టం చేసింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం ఎన్‌వోసీ సాధనపై ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఛత్తీస్‌గఢ్ వెళ్లి అక్కడి ముఖ్యమంత్రితో చర్చలు జరపడంతో పాటు హైదరాబాద్, న్యూఢిల్లీలోనూ పలుమార్లు సమావేశమయ్యారు. ముంపు ప్రభావంపై అధ్యయనం చేయడానికి అవసరమైన నిధులను తెలంగాణ ప్రభుత్వం సమకూర్చింది. అధ్యయన నివేదిక ఆధారంగా ముంపునకు గురయ్యే భూములను గుర్తించి గరిష్ఠ పరిహారం చెల్లిస్తామని ఛత్తీస్‌గఢ్‌కు హామీ ఇచ్చింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కూడా సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ పలుమార్లు కలిసి వినతిపత్రాలు సమర్పించారు.

ముంపుపై అధ్యయనంతో స్పష్టత

సమ్మక్కసాగర్ బ్యారేజీ నిర్మాణంతో ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పడే ముంపుపై ఆ రాష్ట్ర ప్రభుత్వం ఖరగ్‌పూర్ ఐఐటీతో అధ్యయనం చేయించింది. బ్యారేజీ వద్ద 87 మీటర్ల గరిష్ఠ వరద పరిస్థితుల్లో సుమారు 100 ఎకరాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అధ్యయనంలో వెల్లడైంది. బ్యారేజీ పూర్తిస్థాయి నీటినిల్వ మట్టం 83 మీటర్లు కాగా, ఆ స్థాయి వరకు ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లిస్తామని తెలంగాణ ప్రభుత్వం గతంలోనే స్పష్టం చేసింది.



అయితే 2022 జూలై 17, 19 తేదీల్లో గరిష్ఠ వరద 88 మీటర్ల వరకు నమోదైందని పేర్కొన్న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, ఆ మేరకు ముంపునకు గురయ్యే భూములకూ పరిహారం చెల్లించాలని పట్టుబట్టింది. తాజాగా ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనంతో ముంపు విస్తీర్ణంపై స్పష్టత రావడంతో ఎన్‌వోసీకి మార్గం సుగమమవుతుందని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది.

తెలంగాణ విజ్ఞప్తి మేరకు ఛత్తీస్‌గఢ్ అధికారులు 2023 సెప్టెంబరు 6 నుంచి 9వ తేదీ వరకు బ్యారేజీని పరిశీలించారు. అనంతరం సర్వే నిర్వహించి ముంపు ప్రాంతాలను గుర్తించాలని, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని బీజాపూర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌ను తెలంగాణ అధికారులు కోరారు.

95 శాతం పూర్తయిన పనులు

సుమారు రూ.9,257 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన తుపాకులగూడెం బ్యారేజీ పనులు ఇప్పటికే 95 శాతం పూర్తయ్యాయి. ఈ బ్యారేజీలో నీటిని నిల్వ చేసి, బ్యాక్‌వాటర్‌ను దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా తరలించి ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు ప్రాజెక్టు డీపీఆర్‌పై సీడబ్ల్యూసీ గతంలో పలు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. 2011లో కేవలం 10 శాతం కమాండ్ ఏరియాను మాత్రమే ధ్రువీకరించి డీపీఆర్ సమర్పించగా, ఆయకట్టు స్థిరీకరణపై స్పష్టత లేదని సీడబ్ల్యూసీ పేర్కొంది. నీటిపారుదల శాఖ సమర్పించిన సీడీవో సర్టిఫికెట్‌పైనా అభ్యంతరాలు తెలుపుతూ ఇటీవల డీపీఆర్‌ను వెనక్కి పంపించింది. ప్రస్తుతం ఆయకట్టు వివరాలపై స్పష్టత రావడంతో ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ సాధించిన అనంతరం సీడబ్ల్యూసీకి మరోసారి సమగ్ర ప్రాజెక్టు నివేదికను సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యమంత్రి స్థాయిలో జరగనున్న తాజా చర్చలు ప్రాజెక్టు అనుమతుల విషయంలో కీలకంగా మారనున్నాయి.

పాత ఇళ్లకు పట్టాలు

2014కు ముందు గృహ నిర్మాణ పథకాల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు అందజేత

ఏడు లక్షల మందికి ప్రయోజనం: పొంగులేటి

ప్రజా దీవెన, హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్ర హయాంలో వివిధ ప్రభుత్వ గృహనిర్మాణ పథకాల కింద ఇళ్లు నిర్మించుకున్న పేదలకు గతంలో జారీ చేసిన పట్టాలను తిరిగి వారికి అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటి ప్రభుత్వాలు అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకంతోపాటు ఇతర పథకాల కింద ఇళ్లు నిర్మించుకున్న వారికి వీటిని అందజేయనున్నట్లు గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పేదల సొంతింటిపై హక్కును మరింత పదిలం చేస్తూ ఆయా కుటుంబాలకు భరోసా కల్పించే దిశగా ప్రజాప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. దీంతో దాదాపు 7 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. గతంలో అమలు చేసిన ప్రభుత్వ గృహనిర్మాణ పథకాల విధానం ప్రకారం మంజూరు చేసిన ఇళ్లకు పట్టాలు/పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉంది. అయితే దశాబ్ద కాలంగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. మరోవైపు రాష్ట్రంలో 22-ఏ అంశంపై సమీక్షలు జరుగుతున్న సమయంలో ఈ ఇళ్ల పట్టాలు మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో భారీగా ఉన్నాయన్న విషయం వెలుగులోకి వచ్చిందని, ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో వెంటనే ఆ పట్టాలను పేదలకు తిరిగి ఇవ్వాలని ఆదేశించారని మంత్రి పొంగులేటి తెలిపారు. 2014 కంటే ముందు అమలు చేసిన పథకంలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ రాయితీతోపాటు లబ్ధిదారుల వాటా, బ్యాంకు రుణం ద్వారా ఆర్థిక సహాయం అందించేవారని, ఆ రుణాల కోసం లబ్ధిదారుల ఇళ్ల పట్టాలను షూరిటీగా ఉంచుకునేవారని గుర్తు చేశారు. రుణ వాయిదాలన్నింటినీ సక్రమంగా చెల్లించినవారికి తిరిగి ఈ పట్టాలను ఇచ్చేవారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గత ప్రభుత్వం ఇందిరమ్మ పథకాన్ని నిలిపివేయడంతో గతంలోని లబ్ధిదారులకు పట్టాలు అందలేదని మంత్రి పేర్కొన్నారు. దీంతో అప్పటి నుంచి తనఖాలో ఉన్న పట్టాలను లబ్ధిదారులకు ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ప్రజాప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.



లంచం సొమ్ము.. వైన్స్, షేర్ మార్కెట్‌లో..!

స్థలాలు, ఇళ్లు, వాహనాలు కొన్నారు..

మొయినాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారిణి వాణి అక్రమాస్తులు రూ.50 కోట్లు

ఆమె ఇల్లు సహా 8 చోట్ల ఏసీబీ సోదాలు

రెండు ప్లాట్లు, ఒక ఫ్లాట్, జీ+2 భవనం, వ్యవసాయ భూముల గుర్తింపు



ప్రజా దీవెన, హైదరాబాద్: అధికారాన్ని అడ్డు పెట్టుకుని అక్రమంగా సంపాదించిన సొమ్మును వైన్స్‌లో పెట్టుబడులుగా పెట్టారు. షేర్ మార్కెట్లో పెట్టారు. ఆస్తులు, బంగారం కొన్నారు. ఇదీ మొయినాబాద్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారిణి గుండు వాణి తీరు. ఇటీవల లంచం కేసులో ఏసీబీకి పట్టుబడ్డ వాణిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆమెకు రూ.6.76 కోట్ల విలువైన అక్రమ ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. అయితే ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఈ ఆస్తుల విలువ సుమారు రూ.50 కోట్ల వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా ఏసీబీ అధికారులు సోమవారం వాణి నివాసంతోపాటు కార్యాలయం, బంధువులు, సన్నిహితులు, బినామీలకు చెందిన మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో స్థిర, చరాస్తులకు సంబంధించిన కీలక పత్రాలు, నగదు, బంగారు ఆభరణాలు, బ్యాంకు నిల్వలు, పెట్టుబడులను గుర్తించారు. ఏసీబీ గుర్తించిన స్థిరాస్తుల్లో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో 283.11 చదరపు గజాల ప్లాట్, జనగామ జిల్లా పాలకుర్తిలో 424 చదరపు గజాల ప్లాట్ ఉన్నాయి. వీటి విలువ రూ.87.67 లక్షలుగా అంచనా వేశారు. రంగారెడ్డి జిల్లా అత్తాపూర్‌లో రూ.63 లక్షల విలువైన ఒక నివాస ఫ్లాట్, అదే ప్రాంతంలో సుమారు రూ.2.45 కోట్ల విలువైన జీ+2 అంతస్తుల భవనాన్ని గుర్తించారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండలంలో ఎకరం 10 గుంటల వ్యవసాయ భూమి ఉండగా, దీని విలువ రూ.29.70 లక్షలుగా లెక్కగట్టారు. వాణి చరాస్తుల విషయానికి వస్తే.. రూ.5.47 లక్షల నగదు, మహబూబ్‌నగర్‌లోని తుల్జాభవానీ వైన్స్‌లో రూ.50 లక్షల పెట్టుబడి, షేర్లలో రూ.1.30 కోట్ల పెట్టుబడులను ఏసీబీ అధికారులు గుర్తించారు. బ్యాంకు ఖాతాల్లో రూ.7.97 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 175.1 గ్రాముల బంగారు ఆభరణాలు, మహీంద్రా ఎక్స్‌యూవీ 700, హ్యుందాయ్ క్రెటా కార్లతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు కలిపి రూ.50 లక్షల విలువైన వాహనాలు ఉన్నట్లు గుర్తించారు. ఇంట్లోని వస్తువుల విలువ మరో రూ.5.10 లక్షలుగా లెక్కించారు.

ఇప్పటికే లంచం కేసులో అరెస్టు..

గత సెప్టెంబరు 30న గుండు వాణి ఏసీబీకి చిక్కారు. మొయినాబాద్ పరిధిలో ఓ నిర్మాణానికి సంబంధించి రూ.75 వేల లంచం తీసుకున్న కేసులో గుండు వాణితో పాటు సీనియర్ అసిస్టెంట్ సుదర్శన్‌ను అరెస్టు చేశారు. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. తాజాగా ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

అమితాబ్, అభిషేక్‌లను చంపేస్తాం..!

ఏ బుల్లెట్ ప్రూఫ్ అద్దాలూ వారిని కాపాడలేవు

సిక్కు వ్యతిరేకుల అంతు చూస్తాం: గోల్డీ ధిల్లాన్

ముంబై, నవంబరు 16: అమితాబ్ బచ్చన్, ఆయన కుమారుడు అభిషేక్ బచ్చన్‌ను చంపేస్తామంటూ గ్యాంగ్‌స్టర్ గోల్డీ ధిల్లాన్ హెచ్చరించాడు. తన ఇద్దరు అనుచరులను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారని అయినా తన ప్లాన్‌లో ఎలాంటి మార్పూ లేదని ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టాడు. తన అనుచరులు 200 మంది ముంబయిలో సిద్ధంగా ఉన్నారని ధిల్లాన్ పేర్కొన్నాడు. సిక్కులకు వ్యతిరేకంగా మాట్లాడే ఎవరినీ తాను వదిలిపెట్టనంటూ హెచ్చరికలు చేసిన ధిల్లాన్.. అమితాబ్, అభిషేక్ బచ్చన్ పేర్లను ప్రస్తావించాడు. 'వారు ఎన్ని బుల్లెట్ ప్రూఫ్ క్యాబిన్లను కట్టుకున్నా వదిలేది లేదు. వారిని కాల్చేస్తాం' అన్నాడు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధం ఉన్న ఇద్దరు షూటర్లు వికాస్ ఠాకూర్, దీపక్ సింగ్‌లను ఢిల్లీ పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు.

విజయ్ తెరపై హీరో...నిజ జీవితంలో విలన్: స్టాలిన్

చెన్నై, నవంబరు 16 : తమిళనాడు సీఎం విజయ్ వెండి తెరపై హీరో అయినా, నిజ జీవితంలో మాత్రం ప్రజలకు విలన్‌గా మారారని డీఎంకే అధ్యక్షుడు, మాజీ సీఎం ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. హత్యలు, అత్యాచారాలు, దోపిడీలతో విరక్తి చెందిన ప్రజలు.. టీవీకే ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు సిద్ధమయ్యారన్నారు. త్వరలోనే మంచి పరిణామం సంభవించనుందని, డీఎంకే పాలన ఉదయించనుందని ప్రకటించారు. ఆరు నెలలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న విజయ్ ప్రభుత్వం పేరుకు మాత్రమేనని, దానిని రీల్స్ ప్రభుత్వం అని పిలవడం మేలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా లైంగిక దురాగతాలు, హింసలు కొనసాగుతూనే ఉన్నాయని ఆరోపించారు. ఈ లైంగిక దురాగతాల్లో అధికంగా అధికార పార్టీకి చెందిన నేతలే ఉండడం గర్హనీయమన్నారు. ప్రస్తుతం ఆ పార్టీ పేరు 'టీవీకే'కు బదులు 'లైంగిక దోపిడీ ముఠా'గా పెట్టాల్సిన పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు.

తమ్మిడిశెట్టిపై తప్పుడు ప్రచారం తగదు

ప్రజాప్రయోజనాల కోసమే తమ్మిడిహట్టి మార్పు..

కాంగ్రెస్ హయాంలో అనుమతులకే ఏడేండ్ల జాప్యం

తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదనే విషయాన్ని గతంలోనే అసెంబ్లీ సాక్షిగా ఆధారాలతో వివరించా

నీళ్లు లేని చోట ప్రాజెక్టుప్రతిపాదన కాంగ్రెస్ తప్పు

నీటి లభ్యత ఉన్న ప్రాంతానికిప్రాజెక్టును మార్చి ఆ తప్పును నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సరిదిద్దింది

బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు



ప్రజా దీవెన, సిద్దిపేట : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరహాలోనే ఉత్తమ్ కుమార్‌రెడ్డి కూడా వాస్తవాలను కప్పిపెట్టి అబద్ధాలు మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. ఇకనైనా ఉత్తమ్ అబద్ధాలు చెప్పడం మానుకోవాలని హితవుపలికారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పులను బీఆర్ఎస్ ప్రభుత్వం సరిదిద్ది ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకుంటే, ఇప్పుడు అదే విషయాన్ని బీఆర్ఎస్‌పై నిందలు వేయడానికి కాంగ్రెస్ వాడుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ్మిడిహట్టి నుంచి ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని మేడిగడ్డకు రాజకీయ ప్రయోజనాల కోసమో, కమీషన్ల కోసమో మార్చారంటూ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదనే విషయాన్ని గతంలోనే అసెంబ్లీ సాక్షిగా ఆధారాలతో వివరించామని గుర్తుచేశారు. దేశంలో అత్యున్నత జలవనరుల సంస్థ అయిన సెంట్రల్ వాటర్ కమిషన్ ఇచ్చిన సమాచారం ఆధారంగానే చెప్తున్నామని స్పష్టంచేశారు.

కాంగ్రెస్ కాలయాపన

దాదాపు ఏడేండ్ల పాటు కేంద్రం, మహారాష్ట్ర నుంచి ప్రాజెక్టుకు అనుమతులు సాధించకుండా కాంగ్రెస్ హయాంలో కాలయాపన చేశారని హరీశ్ విమర్శించారు. అప్పటి మహారాష్ట్ర సీఎం చౌహాన్ సైతం అనుమతులు లేకుండా ప్రాజెక్టు చేపడితే ఖర్చంతా వృథా అయ్యే ప్రమాదం ఉన్నదని తెలంగాణ ముఖ్యమంత్రికి లేఖ రాశారని గుర్తుచేశారు. మహారాష్ట్ర సీఎం అభ్యంతరాలు తెలిపినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు సరైన అనుమతులు సాధించలేకపోయిందో ఉత్తమ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులను పూర్తిచేయకుండా కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. కాళేశ్వరం, దేవాదుల, సమ్మక బరాజ్, సీతమ్మ సాగర్, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పూర్తిచేసి ఉంటే నేడు రాష్ట్ర రైతాంగానికి ఎంతో మేలు జరిగేదని గుర్తుచేశారు. బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టులకు కరువును ఎదురొనే సామర్థ్యం ఉన్నదని, వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే ప్రజలు, రైతులకు అండగా నిలిచే అవకాశం ఉన్నదని స్పష్టంచేశారు. ప్రాజెక్టుల పనులు కొనసాగించకుండా, అందుబాటులో ఉన్న నీటిని ఎత్తిపోయకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రాష్ట్రానికి కేటాయించిన నీటి వాటాను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం, రాష్ట్ర హకులను కాపాడటం, కృష్ణా జలాల పరిరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కేంద్రం నుంచి అదనంగా ఒక టీఎంసీని కూడా సాధించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉన్నదని దుయ్యబట్టారు.

తప్పులుచేసి బీఆర్ఎస్‌పై ఆరోపణలు

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తున్నదని హరీశ్ మండి పడ్డారు. సాగునీటి విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలన మధ్య ఉన్న తేడాను రాష్ట్ర రైతాంగం స్పష్టంగా గుర్తించిందని, ఏ రైతును అడిగినా బీఆర్ఎస్ హయాంలో సాగునీటి పరిస్థితి ఎలా ఉండేదో చెప్తారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వానకాలంలోనే సుమారు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. రైతాంగం ఎదురొంటున్న ఈ పరిస్థితికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉత్తమ్ కుమార్‌రెడ్డి అనవసర, తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఢిల్లీలో కూర్చొని బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం కాదని, రాష్ట్రానికి రావాల్సిన నీటి హకుల కోసం పోరాడాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్, ఎస్సీ, ఎస్టీ సెల్ మాజీ చైర్మన్ బక్కి వెంకటయ్య, నాయకులు రాధాకృష్ణశర్మ, రాజనర్సు పాల్గొన్నారు.

రుణమాఫీ పూర్తిచేసి వస్తే బొకే ఇచ్చి స్వాగతిస్తా

సీఎంకు హరీశ్ బహిరంగ లేఖ

రైతుల రుణమాఫీ పూర్తిచేసి, రూ.9 వేల కోట్ల రైతుబంధు నిధులు విడుదల చేసి ముఖ్యమంత్రి సిద్దిపేటకు వస్తే తానే బొకే ఇచ్చి స్వాగతం పలుకుతానని హరీశ్‌రావు ప్రకటించారు. సిద్దిపేటకు గతం లో రెండుసార్లు వచ్చినప్పుడు రైతు రుణమాఫీ, రైతుబంధు విషయంలో ఇచ్చిన హా మీలను నెరవేర్చాలని, వెటర్నరీ కాలేజీని పు నరుద్ధరించాలని, నిలిచిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించాలని, పంట నష్టపరిహారం చెల్లించాలని, సాగునీటి ప్రాజెక్టులు, హాస్పిటళ్లు, విద్యాసంస్థల పనులను పూర్తిచేయాలని, మల్లన్నసాగర్ నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని బహిరంగ లేఖ ద్వారా కోరారు. 2024 మే 2న సిద్దిపేట పాత బస్‌స్టాండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రైతు రుణమాఫీని ఆగస్టు 15లోగా పూర్తి చేస్తాన ని కొమురవెల్లి మల్లన్న సాక్షిగా ప్రమాణం చేశారని గుర్తుచేశారు. 45 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతుబంధు డబ్బును రైతుల ఖాతాల్లో వేస్తామని ప్రకటించారని, 230 రోజులు గడిచినా జమ కాలేదని విమర్శించారు.

అభివృద్ధి పనులు నిలిపివేత

నియోజకవర్గానికి గతంలో మంజూరైన రూ.1,070 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింద ని హరీశ్ విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన వెటర్నరీ కాలేజీని కొడంగల్‌కు తరలించిందని ఆరోపించారు. నిలిపివేసిన పనులను పునరుద్ధరించి, పెండింగ్ నిధులు విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. యంగ్ ఇండియా స్కూల్‌ను సిద్దిపేటకు ఎందుకు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా సిద్దిపేటలో ఇప్పటికీ అమలు చేయడం లేదని ఆరోపించారు.

రైతులకు పరిహారం ఏది?

సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబా ద్, బెజ్జంకి తదితర ప్రాంతాల్లో వడగండ్లు, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఇప్పటికీ ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదని గుర్తుచేశారు. పంట నష్టాన్ని మంత్రులు పరిశీలించి ఆదుకుంటామని హామీ ఇచ్చారని, రెండేండ్లు గడిచినా నయాపైసా పరిహారం అందలేదని విమర్శించారు. మల్లన్నసాగర్ నిర్మాణ సమయంలో అప్పటి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న రేవంత్ నిర్వాసితు ల పక్షాన అనేక హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి మూడేండ్లు గడుస్తున్నా సమస్యలను పరిషరించలేదన్నారు.

మూడేండ్లలో జానెడు కాలువ తవ్వలే

మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అం దించే అవకాశం ఉన్నా కాలువల నిర్మాణం, భూసేకరణ పనులను నిలిపివేశారని హరీశ్ పేర్కొన్నారు. ఇరోడ్ లిఫ్ట్ ఇరిగేషన్ సీమ్ పనులు 95 శాతం పూర్తయ్యాయని, మిగిలిన ఐదు శాతం పూర్తి చేయకపోవడంతో సిద్దిపేట రూరల్ మండలంలోని 30 నుంచి 40 గ్రామాలకు సాగునీరు అందడం లేదని తెలిపారు. గౌరవెల్లి రిజర్వాయర్ పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం వేగంగా పూర్తిచేసింద ని గుర్తుచేశారు. మూడేండ్లుగా కాలువల నిర్మాణం, మరమ్మతులు పూర్తి చేయకపోవడంతో ఒక ఎకరానికి కూడా సాగునీరు అందించలేని దుస్థితి నెలకొన్నదని వాపోయారు. ప్రభుత్వం పనులు నిలిపివేయడంతో తపాసుపల్లి రిజర్వాయర్‌కు దేవాదుల నుంచి నీరు సరిగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

కోపం ఉంటే నాపై చూపు

రాజకీయ కక్షతో సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకోవద్దని సీఎం రేవంత్‌ను హరీశ్ కోరారు. కోపం ఉంటే తనపైనే చూపాలని, సిద్దిపేట ప్రజలపై చూపవద్దని విజ్ఞప్తిచేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడొద్దు

కలెక్టర్‌కు ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం వినతి



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.7,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం తెలంగాణ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు చెల్లించాల్సిన కాస్మోటిక్ చార్జీలు, మెస్ బిల్లుల బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలని కోరింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కట్టెల శివకుమార్ మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కాకపోవడంతో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్య అభ్యసించాలనే ఆశయంతో కళాశాలల్లో చేరిన వేలాది మంది విద్యార్థులు ఆర్థిక సమస్యల కారణంగా చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజు బకాయిల కారణంగా విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేస్తూ వారిని మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలన్నింటినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అందాల్సిన కాస్మోటిక్ చార్జీలు, మెస్ చార్జీలు సైతం పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వారి పక్షాన నిలిచి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బండారు శంకర్, రాష్ట్ర గౌరవ సలహాదారు కందుల విజయకుమార్, పెన్షనర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు, గౌరవ సలహాదారు జానీ మియా, స్టేట్ కమిటీ సభ్యుడు సాల్మన్ రాజ్, ఉ పాధ్యక్షులు సురేందర్ నాయక్, ప్రశాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంలో పరిశోధనకు కొమిరిశెట్టి దివ్యకు పీహెచ్‌డీ





ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధకురాలు కొమిరిశెట్టి దివ్యకు పీహెచ్‌డీ పట్టా లభించింది. ఆచార్య వసంత మిట్టపెల్లి పర్యవేక్షణలో ఆమె సమర్పించిన "స్టడీస్ ఆన్ బయోయాక్టివ్ నైట్రోజన్ హెటెరోసైకిల్స్: సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవాల్యుయేషన్ ఆఫ్ (ఆక్సజోల్-2-ఐల్) పిరిమిడిన్ అనలాగ్స్" అనే పరిశోధనా సిద్ధాంత గ్రంథానికి విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ పరిశోధనలో భాగంగా దివ్య కొత్త ఆక్సజోల్--పిరిమిడిన్ అనలాగ్‌లను సంశ్లేషణ చేసి, వాటి జీవక్రియాశీలతను పరిశీలించారు. ముఖ్యంగా ఆయా సమ్మేళనాల క్యాన్సర్ నిరోధక క్రియాశీలతను అధ్యయనం చేయడంపై దృష్టి సారించారు. పరిశోధనను పూర్తిచేసి, 2026 మేలో విశ్వవిద్యాలయానికి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా దివ్యను విశ్వవిద్యాలయ ఉపకులపతి, రిజిస్ట్రార్, పరిశోధన పర్యవేక్షకురాలు ప్రొఫెసర్ వసంత మిట్టపెల్లి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

అఖిల భారత తైక్వాండో పోటీ ల కు ఎంజీయూ జట్టు ఎంపిక

నల్లగొండ టౌన్: అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల తైక్వాండో చాంపియన్‌షిప్‌లో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల ఎంపిక పూర్తయింది. జట్టుకు పిట్టల మధు, తుపాకుల నరేందర్, ఎండీ బషీరుద్దీన్, బుతరాజు ఆదిత్య, నల్లబెల్టి మనోజ్, గజ్జెల్లి సర్వమాధవ్ జిత్, పిడుగు ఉదయ్ కిరణ్ ఎంపికయ్యారు. ఎంపిక కార్యక్రమంలో విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డా మద్దిలేటి పసుపుల, డా ఆర్. మురళి, డా వై. శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. జ్యూరీ సభ్యుడిగా పవన్, ఎంపిక కమిటీ సభ్యుడిగా రెడ్యానాయక్ వ్యవహరించారు.

సమ్మిటి సమస్యపై క్రిమినల్ కేసులు

మళ్లీ ఇండియాలో అడుగుపెట్టకుండా చేయాలి

ఓ విదేశీ నేత వచ్చి మన దేశ ఎన్నికల వ్యవస్థపై ఆరోపణలు చేయడం ఏంటి?

ఆయన ఇమ్మిగ్రేషన్ రూల్స్‌ను ఉల్లంఘించారు

శంషాబాద్‌లోని ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు ఫిర్యాదు

సమ్మిట్ నిర్వాహకులందరిపై క్రిమినల్ కేసులు పెట్టాలి

డీజీపీకి ఫిర్యాదు చేసిన రాంచందర్‌రావు



ప్రజా దీవెన, హైదరాబాద్ : హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన భారత్ సమ్మిట్ వేదికపై ఇటలీ రాజకీయ నాయకుడు, యూరోపియన్ సోషలిస్ట్ పార్టీ సెక్రటరీ జనరల్ జియాకోమో ఫిలిబెక్ కాంగ్రెస్‌కు మద్దతుగా "ఓట్ చోర్.. గద్దీ చోడ్"(ఓట్ల దొంగ అధికారం నుంచి దిగిపోవాలి) అంటూ నినాదం చేయడంపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు సోమవారం పార్టీ ప్రతినిధి బృందంతో కలిసి శంషాబాద్‌లోని ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్(ఎఫ్ఆర్ఆర్వో)లో ఫిర్యాదు చేశారు. ఫిలిబెక్ వీసా, ఇమ్మిగ్రేషన్ నిబంధనలను ఉల్లంఘించారని, ఆయనపై ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్-2025లో సెక్షన్లు 23, 29ల కింద చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన ఇంకా ఇండియాలోనే ఉంటే దేశం నుంచి బహిష్కరించాలని, మళ్లీ భారత్‌లో అడుగుపెట్టకుండా బ్లాక్ లిస్టులో పెట్టాలని అన్నారు. "ఓ విదేశీ నేత భారతదేశానికి వచ్చి మన దేశ ఎన్నికల వ్యవస్థపై ఆరోపణలు చేయడం ఏంటి" అని ప్రశ్నించారు. "ఫిలిబెక్ వ్యాఖ్యల వెనుక భారత్ సమ్మిట్ నిర్వాహకుల పాత్ర ఉందా" అనే కోణంలోనూ దర్యాప్తు చేయాలని కోరారు.

రాహుల్, రేవంత్‌లు చేసినదానికన్నా పెద్ద దేశ ద్రోహం లేదు

భారత్ సమ్మిట్ నిర్వహణకు కేంద్ర హోంశాఖ, విదేశాంగ శాఖ నుంచి అవసరమైన అనుమతులు, రాజకీయ క్లియరెన్స్‌లు పొందారా.. లేదా.. అన్నది కూడా పరిశీలించాలని రాంచందర్‌రావు తన ఫిర్యాదులో కోరారు. "భారత గడ్డపై ఒక విదేశీయుడు మన దేశ సార్వభౌమత్వాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానిస్తూ మాట్లాడుతుంటే, వేదికపై ఉన్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చప్పట్లు కొడుతూ ఆనందించడం, సీఎం రేవంత్ రెడ్డి నవ్వుతూ ప్రోత్సహించడం కంటే పెద్ద దేశద్రోహ చర్య ఇంకొకటి ఉండదు" అని రాంచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇప్పటికే రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి భారతదేశ ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడుతున్నారని, ఇప్పుడు ఏకంగా విదేశీయులను ఇక్కడికి రప్పించి భారత వ్యతిరేక నినాదాలు చేయించడం దౌర్భాగ్యమన్నారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా, పెట్టుబడుల సదస్సు అని చెప్పి 'భారత్ సమ్మిట్'ను భారత వ్యతిరేక సదస్సుగా మార్చారని, సమ్మిట్ నిర్వాహకులందరిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతూ రాంచందర్‌రావు రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు.

మెట్రో ఆదాయంలో 2వ స్థానంలో హైదరాబాద్

ప్రజా దీవెన, హైదరాబాద్ : మెట్రో రైలు ఆదాయంలో హైదరాబాద్.. బెంగళూరుకు గట్టి పోటీ ఇస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వెల్లడైన గణాంకాల ప్రకారం దక్షిణ భారతదేశంలోని నాలుగు ప్రధాన మెట్రో నెట్‌వర్క్‌లు కలిపి రూ.3,203 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాయి. ఇందులో రూ.1,191 కోట్లతో బెంగళూరు మెట్రో మొదటి స్థానంలో నిలవగా.. రూ.1,113 కోట్లతో హైదరాబాద్ మెట్రో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈ రెండు మెట్రోల ఆదాయాల మధ్య వ్యత్యాసం రూ.78 కోట్లు మాత్రమే కావడం విశేషం. దక్షిణాది మెట్రో ఆదాయంలో హైదరాబాద్ వాటా 34.7 శాతంగా ఉంది. నగరంలో పెరుగుతున్న ఐటీ, పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలతో పాటు ఉద్యోగులు, ఇతర ప్రయాణికుల అవసరాలు మెట్రో సేవలకు డిమాండ్‌ను పెంచుతున్నాయి. ఐటీ కారిడార్లు, ప్రధాన వాణిజ్య ప్రాంతాలు, నివాస ప్రాంతాలను అనుసంధానించే మెట్రో మార్గాలు నగర ప్రజలకు కీలక రవాణా సాధనంగా మారాయి. ఆదాయాల పరంగా చెన్నై మెట్రో రూ.624 కోట్లతో మూడో స్థానంలో ఉండగా.. కేరళలోని కొచ్చి మెట్రో రూ.275 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. నాలుగు నగరాల మొత్తం ఆదాయంలో బెంగళూరు, హైదరాబాద్ మెట్రోల వాటానే 72 శాతంగా ఉంది. ఈ రెండు నగరాల మెట్రో వ్యవస్థలు కలిపి రూ.2,304 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాయి. మెట్రో విస్తరణ, ప్రయాణికుల సంఖ్య పెరుగుదలతో హైదరాబాద్ ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది.

ఆత్మకథ అందుకే ఆవిష్కరణ



‘బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్’ పుస్తకాన్ని ఆవిష్కరించిన సోనియాగాంధీ

ఇందిర, రాజీవ్ హత్యల ప్రస్తావనతో భావోద్వేగం

అమ్మ నాలుగుసార్లు క్యాన్సర్‌ను జయించిందన్న రాహుల్

చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకుంటూ ఉద్వేగభరిత ప్రసంగం

కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్, డీకే శివకుమార్ సహా పలువురు నేతలు

లిలిన్యూఢిల్లీ, నవంబరు 16: తన కుటుంబంపై ఏళ్ల తరబడి తప్పుడు ప్రచారం జరిగిందని, అందుకు తన వైపు నుంచి సమాధానం చెప్పాలనే ఉద్దేశంతోనే ఆత్మకథ రాసినట్లు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ వెల్లడించారు. తన కుటుంబ సభ్యులపై అనేక సంవత్సరాలుగా విమర్శలు, అసత్య ప్రచారాలు కొనసాగాయని, వాటికి తన జీవిత అనుభవాలే సమాధానంగా నిలుస్తాయని భావించి పుస్తక రూపంలో తన కథను ఆవిష్కరించానని చెప్పారు. ‘బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్’ పేరుతో ఆమె రచించిన ఆత్మకథను సోమవారం ఢిల్లీలోని ఐటీసీ హోటల్‌లో అధికారికంగా ఆవిష్కరించారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ ఈ కార్యక్రమంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ మాట్లాడుతూ.. తన అత్త ఇందిరాగాంధీ, భర్త రాజీవ్‌గాంధీ, కుమారుడు రాహుల్, కుమార్తె ప్రియాంక సహా కుటుంబ సభ్యులందరిపై ఏళ్ల తరబడి తప్పుడు ప్రచారం జరిగిందన్నారు. మనసును బాధించే వ్యాఖ్యలు, విమర్శలు ఎదుర్కొన్నామని చెప్పారు. తన జీవితంలో జరిగిన సంఘటనలు, అనుభవాలను తన కోణంలో వివరించడానికి పుస్తకమే సరైన మార్గమని భావించినట్లు తెలిపారు. ఈ పుస్తకానికి పాఠకుల నుంచి లభిస్తున్న ఆదరణ ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. పిల్లలు రాహుల్, ప్రియాంక, స్నేహితురాలు మంజూలికా దూబే ప్రోత్సాహంతోనే ఆత్మకథ రాసినట్లు చెప్పారు. డైరీ రాసే అలవాటు లేకపోవడంతో జీవితంలో ఎదురైన సంఘటనలను గుర్తు చేసుకుంటూ రచన సాగించానన్నారు. మొదట్లో రాయడం కష్టంగా అనిపించినా, ప్రారంభించిన తర్వాత జ్ఞాపకాలన్నీ వరుసగా గుర్తుకొచ్చాయని వివరించారు. ఇందిరాగాంధీ హత్య, రాజీవ్‌గాంధీ హత్యకు సంబంధించిన సంఘటనలను రాసేటప్పుడు తీవ్ర భావోద్వేగానికి గురైనట్లు తెలిపారు.

కోడలిగా కొత్త జీవితానికి అలవాటు

ఇటలీ నుంచి భారత్‌కు వచ్చి కొత్త సంస్కృతి, కొత్త కుటుంబంలో కలిసిపోవడానికి తాను ఎదుర్కొన్న అనుభవాలే ఈ పుస్తకంలోని ప్రధాన అంశాలని సోనియా వివరించారు. ఈ దేశానికి చెందిన వ్యక్తిగా మారిన తన ప్రయాణాన్ని చెప్పేందుకే ‘బిలాంగింగ్’ అనే పేరు పెట్టినట్లు తెలిపారు. పెళ్లి తర్వాత అత్తవారింట్లో కొత్త వాతావరణానికి, సంప్రదాయాలకు అలవాటు పడే క్రమంలో తానూ ఎన్నో అనుభవాలు ఎదుర్కొన్నానన్నారు. ఇందిరాగాంధీని మొదట్లో చూసి భయపడేదాన్నని, ఆమెను ‘మమ్మీ’ అని పిలవడానికి కొంత సమయం పట్టిందని గుర్తుచేసుకున్నారు. రాహుల్, ప్రియాంక జన్మించిన తర్వాత ఇందిరాగాంధీలో ఎంతో మార్పు వచ్చిందన్నారు. ఎంత బిజీగా ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులంతా భోజన సమయంలో ఒకచోట చేరి మాట్లాడుకునేవారని పాత జ్ఞాపకాలను పంచుకున్నారు.

అమ్మా.. నాన్న ఎంతో ప్రేమించారు!

పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రాహుల్‌గాంధీ తన తల్లిదండ్రులు సోనియా, రాజీవ్‌లతో ముడిపడిన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగ ప్రసంగం చేశారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో తన తల్లిదండ్రులు తొలిసారి కలుసుకున్న రెస్టారెంట్‌కు చాలా ఏళ్ల తర్వాత తన గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి వెళ్లినట్లు చెప్పారు. అక్కడి సిబ్బంది తన తల్లిదండ్రులను గుర్తుపట్టారని వివరించారు. అక్కడ ‘చికెన్ షాసర్’ ఆర్డర్ చేసిన అనుభవాన్ని సరదాగా వివరిస్తూ.. ప్రేమలో పడాలనుకునేవారు ఆ రెస్టారెంట్‌కు వెళ్లొచ్చని, అయితే అక్కడ ఆ చికెన్ మాత్రం తినకూడదని చమత్కరించారు. దీంతో సభలో నవ్వులు విరిశాయి. తన తండ్రి ఇంట్లో భోజనం చేసే సమయంలో తల్లిని ఒడిలో కూర్చోబెట్టుకునేవారని, చిన్నప్పుడు అన్ని కుటుంబాల్లోనూ అలాగే ఉంటుందని భావించేవాడినని చెప్పారు. స్నేహితుల ఇళ్లలో అలాంటి దృశ్యాలు కనిపించక ఆశ్చర్యపోయేవాడినన్నారు. తల్లిదండ్రులు గొడవ పడటం తన జీవితంలో ఒక్కసారే చూశానని, ఫోన్‌లో మాట్లాడుతున్న రాజీవ్‌గాంధీ తన పిలుపును పట్టించుకోలేదని సోనియా అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం కుటుంబంలో చోటుచేసుకున్న విషాదాలను ప్రస్తావిస్తూ రాహుల్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తన కుటుంబానికి అండగా నిలిచిన ఇద్దరు ముఖ్యమైన వ్యక్తులను హింసాత్మక ఘటనల్లో కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తన తల్లి నాలుగుసార్లు క్యాన్సర్‌ను జయించారని, అయినప్పటికీ ఆమె దాని గురించి ఎప్పుడూ గొప్పగా చెప్పుకోరని వెల్లడించారు. తన జీవితంలో తల్లి భయపడటం, వెనుకడుగు వేయడం చూడలేదన్నారు. ‘అమ్మా.. నాన్న నిన్ను ఎంతో ప్రేమించారు. నిన్ను చూసి ఆయన ఎంత గర్వపడేవారో చెప్పలేను’ అంటూ తల్లి వైపు తిరిగి ప్రసంగాన్ని ముగించారు.

రాజీవ్‌తో ప్రేమ ఓ అద్భుతం

రాజీవ్‌గాంధీతో తన ప్రేమ ప్రయాణం అద్భుతమని సోనియాగాంధీ పేర్కొన్నారు. రాజీవ్ రాజకీయాల్లోకి రావడాన్ని తాను వ్యతిరేకించానని, అప్పట్లో వ్యక్తిగతంగా ఆలోచించానేమోనని ఇప్పుడు అనిపిస్తోందన్నారు. ఆయన మరణం తన జీవితాన్ని పూర్తిగా మార్చివేసిందని చెప్పారు. ఆ తర్వాత తాను చిన్నపిల్లలా అయిపోయానని, రాహుల్, ప్రియాంకలే తనకు అండగా నిలిచి తల్లిదండ్రుల్లా చూసుకున్నారని భావోద్వేగంగా వివరించారు.

ప్రతిపక్ష నేతల సమక్షంలో ఆవిష్కరణ

సోనియాగాంధీ ఆత్మకథ ఆవిష్కరణ కార్యక్రమానికి వివిధ ప్రతిపక్ష పార్టీల నాయకులు హాజరయ్యారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ సుఖు పాల్గొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ కూడా హాజరయ్యారు.

అద్భుతమైన పుస్తకం: అమరీందర్‌సింగ్

బీజేపీ నేత, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్‌సింగ్ కూడా ఈ కార్యక్రమానికి హాజరుకావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సోనియాగాంధీ రచించిన పుస్తకం అద్భుతంగా ఉందని, తాను ఇప్పటికే చదివానని ప్రశంసించారు. తిరిగి కాంగ్రెస్‌లో చేరే ఆలోచన ఉందా అని మీడియా ప్రశ్నించగా.. అలాంటి ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. తన పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాలకు సోనియాగాంధీ హాజరైనందున, ఆమె పుస్తకావిష్కరణకు రావడం సంతోషంగా ఉందని తెలిపారు.

అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పు

జీవితకాల జైలు శిక్షనూ సస్పెండ్ చేస్తున్నాం

వెంటనే వారిని విడుదల చేయండి

బిల్కిస్‌బానో కేసులో ఇద్దరు దోషుల పిటిషన్‌పై సుప్రీంకోర్టు సంచలన ఉత్తర్వులు

దోషుల్లో ఒకరు వైకల్యంతో బాధపడుతున్నారు

వారి పిటిషన్‌లో వాస్తవాలు, చట్టపరమైన అంశాలను పరిశీలిస్తాం: న్యాయమూర్తులు

వారు ఘోరం చేశారు.. బెయిలివ్వొద్దు: సర్కార్



న్యూఢిల్లీ, నవంబరు 16: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన 2002 నాటి బిల్కిస్ బానో సామూహిక అత్యాచారం, కుటుంబ సభ్యుల ఊచకోత కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఇద్దరు దోషులకు సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అంతేకాదు, వారికి విధించిన జీవిత ఖైదును కూడా నిలిపివేసింది. ఈ కేసులో దోషులు బిపిన్‌చంద్ర జోషి, ప్రదీప్ మోధియాలు ఇప్పటికే 17 ఏళ్లకుపైగా జైల్లో ఉన్నారని వారిలో బిపిన్‌చంద్ర జోషి తీవ్ర వైకల్యంతో బాధపడుతున్నారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో వారిని వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పీబీ వరాలేతో కూడిన ధర్మాసనం గత నెల 28న ఇచ్చిన ఉత్తర్వులను సోమవారం సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. అయితే, దోషులు దాఖలు చేసిన అప్పీళ్లలో కొన్ని వాస్తవాలు, మరికొన్ని చట్టపరమైన అంశాలు ఉన్నాయని, వాటిని పరిశీలిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. బిల్కిస్ బానో కేసును విచారించిన బాంబే హైకోర్టు 2017లో వారికి విధించిన యావజ్జీవ కారాగార శిక్షను సమర్థించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దోషులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమకు విధించిన జీవిత ఖైదును నిలిపివేయాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. వారి అరెస్టుకు దారితీసిన పరిస్థితులు, సుదీర్ఘకాలం జైల్లో ఉండడాన్ని పరిగణనలోకి తీసుకుని ఇరువురికీ షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. కాగా, ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ రాజ ఠాక్రే మాత్రం బెయిల్ ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. “నాడు జరిగిన ఘోరం, విచారణ కోర్టు, బాంబే హైకోర్టులు ఒకే విధమైన తీర్పులు ఇవ్వడాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఘటనకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించాలి. ఇది అత్యంత తీవ్రమైన ఘటన. పిటిషనర్లకు బెయిల్ ఇవ్వద్దు.” అని వాదనలు వినిపించారు. పిటిషనర్ల తరఫున సీనియర్ అడ్వొకేట్ సిద్ధార్థ లూథ్రా స్పందిస్తూ.. నాటి ఘటనకు సంబంధించి నమోదైన ప్రాథమిక ఎఫ్ఐఆర్‌లో ఒకరి పేరు అసలు లేదని, ఘటన జరిగిన మూడేళ్ల తర్వాత అతని పేరును చేర్చారని వివరించారు. బాధితురాలు సైతం వైద్యులకు ఇచ్చిన వాంగ్మూలంలో ఎక్కడా వీరి పేర్లను పేర్కొనలేదన్నారు. “ఈ ఇద్దరిపై ప్రత్యక్షంగా ఎలాంటి ఆరోపణలు లేవు. ఘటన జరిగిన సమయంలో వారు గుంపులో ఉన్నారన్న ఆరోపణలతోనే కేసు పెట్టారు.” అని లూథ్రా వివరించారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. “పిటిషనర్లు 17 ఏళ్లకు పైగా జైల్లో ఉన్నారు. వారిలో ఒకరు(జోషి) తీవ్ర వైకల్యంతో బాధపడుతున్నారు. ఈ అప్పీలులో వాస్తవాలు, చట్టానికి సంబంధించిన అంశాలు ఉన్నాయి. వాటిని పరిశీలిస్తాం.” అని పేర్కొంటూ బెయిల్ మంజూరు చేసింది. అయితే.. బెయిల్ షరతులు వర్తిస్తాయని స్పష్టం చేసింది.

నాడు ఏం జరిగింది?

2002, ఫిబ్రవరిలో గుజరాత్‌లో గోద్రా రైలు దహనం తర్వాత మతపరమైన అల్లర్లు చెలరేగాయి. ఆ సమయంలో అల్లర్ల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన 21 ఏళ్ల బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం జరిగింది. ఆ సమయానికి ఆమె ఐదు నెలల గర్భవతి. అంతేకాదు.. ఆమె మూడేళ్ల చిన్నారి సహా ఏడుగురు కుటుంబ సభ్యులను దోషులు ఊచకోతకోశారు. ఈ కేసులో మొత్తం 11 మందిని దోషులుగా గుర్తించి జీవిత ఖైదు విధించగా.. వీరిని 2024లో గుజరాత్ ప్రభుత్వం జైలు నుంచి ముందుగానే విడుదల చేయడం అప్పట్లో దుమారం రేపింది. ఈ వ్యవహారంపై బిల్కిస్ బానో సుప్రీంకోర్టును ఆశ్రయించగా విచారణ జరిపిన న్యాయస్థానం.. సదరు దోషులను తిరిగి జైలుకు పంపింది. అంతేకాదు, గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. “కేసు విచారణ పరిధి మహారాష్ట్రలో ఉండగా శిక్షను మీరెలా తగ్గిస్తారు. దోషులతో కుమ్మక్కయినట్లు కనిపిస్తోంది.” అని మండిపడింది.

మనీలాలో మన మోదీ

మూడు రోజుల ఫిలిప్పీన్స్ పర్యటనకు చేరుకున్న భారత ప్రధాని

నేడు 23వ ఆసియాన్-భారత్ సదస్సుకు హాజరు

ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్‌తో కీలక భేటీ

వాణిజ్యం, పెట్టుబడులు, సముద్ర భద్రతపై చర్చలు

ప్రవాస భారతీయులతోనూ సమావేశమైన ప్రధాని

న్యూఢిల్లీ: మూడు రోజుల పర్యటన నిమిత్తం భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాకు చేరుకున్నారు. సోమవారం మనీలా అంతర్జాతీయ విమానాశ్రయంలో అడుగుపెట్టిన ఆయనకు ఫిలిప్పీన్స్ అధికారులు, ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. సాంస్కృతిక కార్యక్రమాలతో భారత ప్రధానికి ఆహ్వానం పలికారు. ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ ఆహ్వానం మేరకు మోదీ ఈ పర్యటన చేపట్టారు. ఈ పర్యటనలో భాగంగా నవంబరు 17న జరగనున్న 23వ ఆసియాన్-భారత్ సదస్సు, 21వ తూర్పు ఆసియా సదస్సులో ప్రధాని పాల్గొననున్నారు. భారత్, ఆగ్నేయాసియా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చించనున్నారు.

వాణిజ్యం.. సముద్ర భద్రతపై చర్చలు

భారత్, ఆసియాన్ దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, రవాణా అనుసంధానం, సాంకేతిక పరిజ్ఞానం, సముద్ర భద్రత వంటి అంశాలు సదస్సు ఎజెండాలో కీలకంగా ఉండనున్నాయి. ఆసియాన్-భారత్ వస్తువుల వాణిజ్య ఒప్పందం సమీక్షపైనా చర్చలు జరగనున్నాయి. దక్షిణ చైనా సముద్రంలో నెలకొన్న పరిణామాలు, ప్రాంతీయ భద్రత, అంతర్జాతీయ సముద్ర మార్గాల రక్షణ వంటి అంశాలు తూర్పు ఆసియా సదస్సులో ప్రస్తావనకు వచ్చే అవకాశముంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భాగస్వామ్య దేశాలతో సహకారాన్ని మరింత విస్తరించడంపై భారత్ దృష్టి సారించనుంది.

ప్రవాస భారతీయులతో ముచ్చట్లు

మనీలాలోని ప్రవాస భారతీయులతోనూ ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక భారతీయ, ఫిలిప్పీన్స్ విద్యార్థులు రామాయణ ఇతివృత్తంతో రూపొందించిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. ‘సీత: ది రామాయణ రీవిజిటెడ్’ పేరుతో నిర్వహించిన నాటక ప్రదర్శనను ప్రధాని ఆసక్తిగా వీక్షించారు. మరోవైపు ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ ప్రధాని మోదీ గౌరవార్థం ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఈ విందులోనూ మోదీ పాల్గొన్నారు.

రిజర్వేషన్‌ల రొటేషన్ రాష్ట్రాలదే

రిజర్వేషన్ల రొటేషన్ విధానంపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కేటాయింపుపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఏయే స్థానాలకు ఏ రిజర్వేషన్ వర్తింపజేయాలన్న దానిపై అధికారం పూర్తిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందని పేర్కొంది. తమ నియోజకవర్గాన్ని రిజర్వుడ్‌గా నిర్ణయించాలని కోరే హక్కు ఎవరికీ ఉండదని స్పష్టం చేసింది. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించి నూతన రొటేషన్ విధానాన్ని అమలు చేస్తుండడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది. రూపాలీ ఇంద్రభూషణ్ సోండే అనే వ్యక్తి.. బాంబే హైకోర్టులోని నాగ్‌పూర్ బెంచ్ 2025 సెప్టెంబరులో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఈ పిటిషన్ దాఖలు చేశారు. గతంలో ఉన్న రిజర్వేషన్ క్రమాన్ని పక్కన పెట్టి కొత్త రొటేషన్ విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల తదుపరి రిజర్వేషన్ పొందాల్సిన నియోజకవర్గాలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు.

ఈసీకి ఇండి కూటమి 48 ప్రశ్నలు

ఎస్ఐఆర్‌పై నిర్ణయం సమష్టిగా తీసుకున్నారా? సీఈసీ ఒక్కరేనా?

ఈసీని ప్రశ్నించడానికి అనుమతి కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ : లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇండి కూటమికి చెందిన ఇతర నాయకులు.. ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై ఎన్నికల సంఘానికి (ఈసీకి) 48 ప్రశ్నలు సంధించారు. వాటిని ఈసీకి అధికారికంగా అందించి, వివరాలు రాబట్టటానికి వీలుగా సుప్రీంకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు అనుమతితో ఒక పక్షం మరో పక్షానికి లిఖితపూర్వకంగా ప్రశ్నలు సంధించవచ్చు. వీటిని ‘ఇంటరాగేటరీలు’ అని అంటారు. కాగా, ఈ 48 ప్రశ్నల్లో ఎస్ఐఆర్‌కు సంబంధించిన పలు అంశాలు ఉన్నాయి. ఎస్ఐఆర్‌ను చేపట్టాలనే నిర్ణయాన్ని ఈసీలోని కమిషనర్లందరూ సమష్టిగా తీసుకున్నారా? లేక, ఇతర కమిషనర్లకు తెలియకుండా లేదా వారి ఆమోదం లేకుండానే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఒక్కరే తీసుకున్నారా? ఎస్ఐఆర్, ఆన్‌లైన్ ఫారం-6లో మార్పులు, ఈసీఐనెట్, ఈఆర్‌వోనెట్ వంటి ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌ల పనితీరుకు సంబంధించి ఈసీ తీసుకున్న నిర్ణయాలపై రికార్డులు ఎందుకు అందుబాటులో లేవు? ఈసీ పోర్టల్‌లో చేసిన మార్పులేమిటి? వాటిని ఈసీలో ఎవరు చేశారు? ఎస్ఐఆర్, ఈసీఐనెట్, ఈఆర్‌వోనెట్, ఫాం 6, పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల తొలగింపుపై దాఖలైన అప్పీళ్లు మొదలైన వాటిపై ఎన్నికల కమిషనర్లలో ఎవరైనా లిఖితపూర్వకంగా అభ్యంతరాలను వ్యక్తం చేశారా? లేదా? ఈ ఏడాది జూలై 30వ తేదీన ఇద్దరు కమిషనర్లు సంయుక్తంగా ఇచ్చిన ఆదేశాలను సీఈసీ అంగీకరించారా? ఓటర్ల జాబితాలో పేర్లను తొలగించే, చేర్చే, కొనసాగించే అధికారం ఎవరికి ఉంది? ఎస్ఐఆర్‌లో భాగంగా ఏ రాష్ట్రంలో ఎన్ని ఓట్లను తొలగించారు? కారణాలేమిటి? తదితర ప్రశ్నలున్నాయి. కాగా సీఈసీ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ గతంలో ప్రతిపక్ష నేతలు దాఖలు చేసిన పిటిషన్‌పై ఈసీ స్పందించింది. నిర్ణయాలన్నీ సమష్టిగా తీసుకున్నవేనంటూ ఈసీ తరఫున డిప్యూటీ ఎన్నికల కమిషనర్ ఏటూరు భానుప్రకాశ్ సుప్రీంకోర్టులో 248 పేజీల అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో, ఇండియా కూటమి నేతలు తాజాగా 48 ప్రశ్నలు సంధించారు. వీటికి భానుప్రకాశ్‌తోపాటు సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు, ఈసీ డైరెక్టర్ జనరల్(ఐటీ) అఫిడవిట్ రూపంలో సమాధానాలు ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాల్సిందిగా సుప్రీంకోర్టును కోరారు. ఓట్ల చోరీపై తాము పలుమార్లు అడిగిన ప్రశ్నలకు ఈసీ తన అఫిడవిట్‌లో సమాధానాలు ఇవ్వటం లేదు కాబట్టే, ఈసీని ప్రశ్నించటం కోసం సుప్రీంకోర్టు అనుమతి కోరామని కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో పేర్కొంది.

భారీగా ఖర్చు పెట్టినా.. కాలుష్యం పోదేం?

యమునా నదిలో కాలుష్యం పెరుగుదలపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : యమునా నది కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నదిని శుభ్రం చేసేందుకు భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేసినప్పటికీ.. కాలుష్యం పెరిగిందే తప్ప తగ్గలేదని పేర్కొంది. ఈ క్రమంలో నది, దాని ప్రధాన కాలువలు వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జిల్లాల్లోకి ప్రవేశించే (ఎంట్రీ), బయటకు వచ్చే (ఎగ్జిట్ పాయింట్) చోట్ల నీటి నాణ్యత పరీక్షలు చేయాలని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ)ని ఆదేశించింది. నదిని శుభ్రపరిచేందుకు కేవలం మురుగునీటి శుద్ధి పాంట్లను నిర్మించడం సరిపోదని, పారిశ్రామిక కాలుష్య కారకాలు, శుద్ధి చేయని మురుగునీటిని వాటి మూలం వద్దనే అరికట్టాలని, వీలైతే పూర్తిగా నిరోధించాలని పేర్కొంది. ఏదైనా రాష్ట్రం, యూటీ, జిల్లా గుండా ప్రవహించేటప్పుడు.. నదీ జలాల నాణ్యత క్షీణిస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, జరిమానాలు విధిస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. తదుపరి విచారణను జనవరి 13కు వాయిదా వేసింది.

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి నాయనమ్మ దశదిన కర్మకు హాజరైన మంత్రి సీతక్క



భువనగిరి : భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి నాయనమ్మ చామల రంగనాయకమ్మ దశదిన కర్మ కార్యక్రమం శాలిగౌరారం లో జరిగింది. ఈ కార్యక్రమం నకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క, చామల రంగనాయకమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమం లో శాసన మండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,ఎంపీ కడియం కావ్య,భువనగిరి, దేవరకొండ ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, బాలునాయక్,నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నూక కిరణ్ కుమార్ యాదవ్,రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత,శాలిగౌరారం మార్కెట్ కమిటీ ఛైర్మెన్ పాదూరి శంకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చింత ధనుంజయ్య, జిల్లా నాయకులు అన్నెబోయిన సుధాకర్, కందాల సమరం రెడ్డి, చామల మహేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి,మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు తోటకూరి పరశురామ్,పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు, గ్రామ ప్రజలు పాల్గొని నివాళులర్పించారు.

సత్యమేవ జయతి వ్యవస్థాపకులు బాలకృష్ణ నిర్వహిస్తున్న సేవలు అభినందనీయం : సుబ్బారావు



ప్రజా దీవెన,కోదాడ : సత్యమేవ జయతే సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నాదెళ్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కోదాడ ప్రముఖ వైద్యులు డాక్టర్ సుబ్బారావు అన్నారు సోమవారం పట్టణ పరిధిలో వివిధ దేవాలయాల వద్ద, వివిధ కూడలి వద్ద బస్టాండ్ లో ఉంటున్న యాచకులకు దుప్పటి, మంకీ క్యాప్, చేతిబుట్ట, భోజనం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు, సత్యాన్వేషణ మండలి వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్రబాబు లు పాల్గొని యాచకులకు అందజేశారు అనంతరం వారు మాట్లాడుతూ నాదెళ్ల బాలకృష్ణ సత్యమేవ జయతే సేవా సమితిని స్థాపించి ఆ సేవా సమితి ద్వారా కోదాడ పరిసర ప్రాంతాల్లో ఎన్నో గొప్ప సేవ కార్యక్రమాలు నిర్వహించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. చలికి యాచకులు ఇబ్బంది పడుతున్నారని గమనించి వారికి దుప్పటి మంకీ క్యాప్ ఒకరోజు భోజనం ఏర్పాటు చేయడం దానికి మేము రావడం మాకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. రాబోయే రోజులలో కోదాడ పరిసర ప్రాంతాలలో సత్యమేవ జయతే సేవాసమితి ద్వారా ఎన్నో మంచి మంచి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబాక భాస్కర్ నాదెళ్ల సత్య అనంతలక్ష్మి ఆర్ నాగేశ్వరరావు పుష్యమి రహీం

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి : కుసుమ



ప్రజా దీవెన, కోదాడ: 28వ వార్డులో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతంటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ ఏర్నేని కుసుమ వెంకటరత్నం బాబు అన్నారు సోమవారం మున్సిపల్ పరిధిలోని 28వ వార్డులో వార్డు కౌన్సిలర్ తోట జ్యోతి శ్రీనివాస్ తో కలిసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు కావున అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, వార్డు నాయకులు, లబ్ధిదారులు, స్థానికులు పాల్గొన్నారు.

మార్మోగిన రైతు ఉద్యమ నినాదాలు

ఆర్ఎస్ఎస్, బీజేపీ విధా నాలపై దేశవ్యాప్త పోరాటాలకు ఏఐకేఎస్ పిలుపు

రైతు ఐక్యతే కేంద్ర ప్రభుత్వ విధానాలకు అడ్డుకట్ట

600 రైతు సంఘాల ఐక్యతతో సంయుక్త కిసాన్ మోర్చా

నవంబర్ 26న దేశవ్యాప్త ఆందోళనలు, 27న చక్కాజా మ్‌కు రాకేష్ టికాయత్ పిలుపు





ప్రజా దీవెన, నల్లగొండ: రైతాంగ హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల సంరక్షణ, కేంద్ర ప్రభు త్వ విధానాలపై దేశవ్యాప్త ప్రతి ఘటనకు రైతు సంఘాలు సిద్ధ మవుతున్నాయి. వామపక్ష, ప్ర జాస్వామిక, లౌకిక శక్తుల ఐక్యత తో విస్తృత ఉద్యమాలు నిర్మిం చాలని అఖిల భారత కిసాన్ స భ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలు పిలుపునిచ్చాయి. నల్లగొండ వేదికగా జరుగుతున్న ఈ మహాసభల్లో రైతాంగ సమ స్యలు, వ్యవసాయ సంక్షోభం, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ పై జాతీయ స్థాయి నాయకులు కీలక ప్రసంగాలు చేశారు.

ఆర్ఎస్ఎస్--బీజేపీ విధానాలపై బహుముఖ పోరాటం

ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశోక్ ధావలే మాట్లాడు తూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కా ర్పొ రేట్ సంస్థలకు ప్రయోజనం చేకూ ర్చేలా ఉన్నాయని విమర్శించా రు. రైతులు, కార్మికులు, వ్యవసా య కూలీలు సహా అన్ని వర్గాల ప్రజల హక్కుల పరిరక్షణకు సం ఘటిత పోరాటాలు అవసరమ న్నారు. ఆర్ఎస్ఎస్--బీజేపీ భా వజాలాన్ని ఎదుర్కొనేందుకు రాజకీయ, సైద్ధాంతిక, సామాజి క, సాంస్కృతిక, మీడియా, ఆం దోళనాత్మక, సంస్థాగత రంగాల్లో ఏడు విధాలుగా నిరంతర పోరా టాలు సాగించాలని పిలుపుని చ్చారు. ప్రజల్లో చైతన్యం పెంచు తూ వామపక్ష, ప్రజాస్వామిక, లౌకిక శక్తులను ఏకతాటిపైకి తీసుకురావాలని సూచించారు.లెనిన్ ప్రతిపాదించిన ఆందోళన, ప్రచారం, సంస్థాగత నిర్మాణం అ నే మూడు సూత్రాలను క్షేత్రస్థా యిలో అమలు చేయాలని, ఏ ఐ కేఎస్ స్వతంత్ర సంస్థాగత బలా న్ని మరింత పెంచుకోవాలని స్ప ష్టం చేశారు.

600 రైతు సంఘాల ఐక్యత.. చారిత్రక విజయం

రైతు ఉద్యమ నాయకుడు రాకే ష్ టికాయత్ మాట్లాడుతూ రై తాంగం, వ్యవసాయ కార్మికులు, భూమిలేని పేదలు, ఆదివాసీలు ఐక్యంగా పోరాడితేనే రైతు వ్య తిరేక విధానాలను అడ్డుకోగల మన్నారు.ఢిల్లీలో 13 నెలల పా టు సాగిన రైతు ఉద్యమం ఐక్య తా శక్తికి నిదర్శనమని గుర్తుచే శారు. సుమారు 600 రైతు సం ఘాలను సంయుక్త కిసాన్ మో ర్చా వేదికపైకి తీసుకురావడం చారిత్రక పరిణామమన్నారు. రై తులతో పాటు కార్మికులు, ఆది వాసీలు, చిన్న వ్యాపారులు, సా మాన్య ప్రజలు భాగస్వాములైన ఆ ఉద్యమం మూడు వ్యవసా య చట్టాల రద్దుకు దారితీసిం ద ని వివరించారు.

నవంబర్ 26న దేశవ్యాప్త ఆందో ళనలు

రైతాంగ ఉద్యమాన్ని మరింత వి స్తరించేందుకు సంయుక్త కిసాన్ మోర్చా భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తోందని టికాయత్ తె లిపారు. నవంబర్ 26న దేశవ్యా ప్తంగా రైతు ఆందోళనలు నిర్వ హించాలని, 26వ తేదీ రాత్రి నిర సన ప్రదేశాల్లోనే బస చేసి ఉద్య మాన్ని కొనసాగించాలని పిలుపు నిచ్చారు. నవంబర్ 27న ఉద యం చక్కాజామ్ నిర్వహించాల ని సూచించారు.

తెలంగాణ రైతాంగ పోరాటానికి ఘన నివాళి

నిజాం నిరంకుశ పాలనకు వ్య తి రేకంగా సాగిన తెలంగాణ సా యుధ రైతాంగ పోరాటాన్ని రాకే ష్ టికాయత్ స్మరించుకున్నారు. వేలాది మంది రైతులు, వ్యవసా య కార్మికులు, మహిళలు, యు వత చేసిన త్యాగాలు దేశ చరిత్ర లో చిరస్థాయిగా నిలిచాయని పే ర్కొన్నారు. రైతు హక్కుల కోసం నాడు సాగిన పోరాట స్ఫూర్తి నేటి ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలవాలన్నారు.

రైతు సంక్షోభానికి పరిష్కారమే లక్ష్యం

వ్యవసాయ పెట్టుబడుల పెరుగు దల, గిట్టుబాటు ధరల కొరత, అ ప్పుల భారం, సాగునీటి సమస్య లు రైతు కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నాయని మహాసభలో ఆందోళన వ్యక్తమైం ది. పంటలకు చట్టబద్ధమైన కనీ స మద్దతు ధర, రైతుల రుణభా రం తగ్గింపు, ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ బలోపేతం, కౌలు రైతు లు, వ్యవసాయ కార్మికులకు భద్ర త కల్పించాలని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

ప్రముఖులకు మహాసభ నివాళు లు

మహాసభలో సీతారాం ఏచూరి, వి.ఎస్. అచ్యుతానందన్, బుద్ధ దేవ్ భట్టాచార్య, ఎన్. శంకర య్య, సారంపల్లి మల్లారెడ్డి తది తర ప్రముఖ నాయకుల సేవ ల ను స్మరించుకుంటూ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. రైతు, కార్మిక ఉద్యమాల్లో ప్రాణాలర్పిం చిన అమరవీరులకు నివాళుల ర్పించారు. యుద్ధాలు, ప్రకృతి విపత్తులు, రైతుల ఆత్మహత్య ల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం ప్రకటించారు.

రైతు పోరాటాల చరిత్రకు నల్లగొం డ వేదిక

ఆహ్వాన సంఘం అధ్యక్షుడు జూ లకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. రైతాంగ పోరాటాల చరిత్రలో ప్ర త్యేక స్థానం కలిగిన నల్లగొండలో ఏఐకేఎస్ 36వ జాతీయ మహాస భలు నిర్వహించడం గర్వకారణ మన్నారు. 1936లో స్థాపించబ డిన అఖిల భారత కిసాన్ సభ తొమ్మిది దశాబ్దాల ప్రస్థానం రైతు ల హక్కుల పోరాటాలతో ముడి పడి ఉందని వివరించారు. తెలం గాణ సాయుధ రైతాంగ పోరాట వారసత్వాన్ని గుర్తుచేస్తూ, భూ మి, గిట్టుబాటు ధర, రైతుల ఆ త్మగౌరవం, సామాజిక న్యాయం కోసం భవిష్యత్తులోనూ ఐక్య ఉ ద్యమాలు కొనసాగించాలని పి లుపునిచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ప్రతినిధుల కు నల్లగొండ ప్రజల తరఫున స్వా గతం పలికారు.రైతాంగ ఐక్యత, సంఘటిత పోరాటాలు, ప్రజా ఉ ద్యమాల బలోపేతమే భవిష్యత్ కార్యాచరణగా నల్లగొండలో జరు గుతున్న ఏఐకేఎస్ 36వ జాతీ య మహాసభలు స్పష్టమైన సం దేశాన్ని ఇచ్చాయని చెప్పవచ్చు.






రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కొనసాగుతోంది

పార్టీలకతీతంగా అర్హులైన పేద ప్రజలకు పెన్షన్ల మంజూరు

ఎమ్మెల్యే మందుల సామెల్



ప్రజా దీవెన, తుంగతుర్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్రంలో ప్రజా పాలన ప్రజా సంక్షేమ పథకాలతో కొనసాగుతుందని

అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గం కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్ లో తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాలకు సంబంధించి సోమవారం చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మందుల సామెల్ అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ఇతర అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు అందించడం ద్వారా వారి జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, సామాజిక భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని అన్నారు..గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు అభివృద్ధి పేరుతో దోచుకున్నారని,పింఛన్ కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులకు ప్రభుత్వం అండగా నిలుస్తూ నూతన పింఛన్లు మంజూరు చేయడం సంతోషకరమని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని తెలిపారు.నూతన పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఎమ్మెల్యే మందుల సామెల్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి గ్రామ సర్పంచ్ మల్లెపాక సాయి బాబా, డిఆర్డిఏ పిడి సన్యాసయ్య, ఎంపీడీవోలు చలపతి, సునీత, తాహసిల్దార్ దయానందం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రేగటి రవి గౌడ్, వెంకన్న, మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు గుడిపాటి సైదులు, జయసుధ సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, ఆత్మ కమిటీ చైర్మన్ పానుగంటి నరసింహారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ గంగరాజు యాదవ్,వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు,నాయకులు, మూడు మండలాల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి

ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్





ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: పిల్లల హక్కుల పరిరక్షణకు, వారి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ప్రత్యేక చర్యలు చేపడుతోందని, పిల్లలకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న పిల్లల ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫెరెన్స్ హాలులో నిర్వహించిన పిల్లల ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమానికి బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు గోగుల సరితతో కలిసి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లలు, వారి తల్లిదండ్రులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణిలో భాగంగా ఓ బాలిక కాలి శస్త్రచికిత్స కోసం సహాయం కోరగా, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి డీఎంహెచ్ఓతో మాట్లాడి వైద్య సహాయం అందించేలా చర్యలు చేపట్టారు. అదేవిధంగా మనవరాలి వైద్య చికిత్స కోసం వచ్చిన ఓ వృద్ధుడి సమస్యపై కూడా స్పందించి, సంబంధిత వైద్య అధికారులతో మాట్లాడి చికిత్స అందించేందుకు కృషి చేశారు. పిల్లల సమస్యల పరిష్కారంలో అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి న్యాయబద్ధంగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పిల్లల హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పిల్లల ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత, జిల్లా శిశు సంక్షేమ అధికారిని లావణ్య కుమారి, టి సి పి ఓ గణేష్, జిల్లా అధికారులు పాల్గొనగా, మొదటిసారి నిర్వహించిన పిల్లల ప్రజావాణికి 30 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన రెగ్యులర్ ప్రజా వాణి కార్యక్రమంలో రెవె న్యూ శాఖకు 63 ఇతర శాఖలకు 95 ధరఖాస్తులు రాగా, పిల్లల ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు కలుపుకుని మొత్తం 188 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి కార్య క్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీని వాస్, శిక్షణ సహాయ కలక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డిఆర్ఓ దశరథ్, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించా రు.

పనిచేసే కూలీలకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్



ప్రజా దీవెన, నల్లగొండ: ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాలలో పనిచేసే కూలీలకు అవసరమైన అన్ని వసతులు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ఎక్కడ వెట్టి కార్మికులు ఉండకూడదని, కూలీల సంక్షేమమే ధ్యేయంగా యజమానులు అవసరమైన మౌలిక సదుపాయాలు, రక్షిత మంచినీరు కల్పించాలని చెప్పారు. సోమవారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాలు,తదితర ప్రదేశాలలో పనిచేసే కూలీలు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కూలీల సంక్షేమం, వెట్టి చాకిరి తదితర అంశాలపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు . ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా కూలీలకు అన్ని రకాల పనులను కల్పించాల్సిన అవసరం ఉందని,అయితే బయట నుండి వచ్చిన కూలీలు పనిచేసే చోట తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని, మైనర్లు, గర్భిణి స్త్రీలు ,బాలింతలను పనుల్లో పెట్టుకోవద్దని, ఇటుక బట్టీలు, పౌల్ట్రీఫారాలలో ఎంత మంది పనిచేస్తున్నారో పూర్తి వివరాలను ముందే నమోదు చేసి అవసరమైన అన్ని వసతులు కల్పించాలని, నివాసానికి ఆమోదయోగ్యమైన పని ప్రదేశాలు ఉండాలని, వివరాలన్నింటిని నిర్దేశించిన ప్రొఫార్మర్లో పంపించాలని, అన్నిచోట్ల బయోమెట్రిక్ హాజరు, సిసిటీవీ ఏర్పాటు చేయాలని, పనిచేసే కూలీల పిల్లలకు అవసరమైన విద్య, వైద్యం ,ఇతర వసతులు కల్పించాలని, ఎంపీడీవో, తహసిల్దార్ ,సిఆర్పి, ఎంఈఓ, ఏఎన్ఎంలు రెగ్యులర్గా పని ప్రదేశాలకు వెళ్లి తనిఖీ చేయాలని, వారికి విద్య, వైద్య సదుపాయాలు, రేషన్ అందేలా చూడాలని, అధికారులు తనిఖీలకు వచ్చిన సమయంలో ఇటుక బట్టీల యజమానులు సహకరించాలని కోరారు. అడిషనల్ ఎస్పీ రమేష్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి ,ఉప కార్మిక సహాయ కమి షనర్ చంద్రశేఖర్ గౌడ్, ఆర్డీవో లు, వివిధ శాఖ అధికారు లు, ఇ టుక బట్టి యజమానులు, పౌల్ట్రీ ఫారాల యజమానులు, తదిత రులు ఈ సమావేశానికి హాజర య్యారు.

ఎన్నికల సంఘానికి తుది పోలింగ్ కేంద్రాల జాబితా

రెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్ట వద్రుల నియోజకవర్గానికి సంబం ధించితుది పోలింగ్ కేంద్రాల జా బితాను ఖరారు చేసి ఎన్నికల సంఘానికి పంపించనున్నట్లు ఈఆర్వో ,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్ తెలిపారు. వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్ట బద్రుల నియోజకవర్గ పోలింగ్ కేంద్రాల తుది జాబితా పై సోమ వారం అయన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమావే శం నిర్వహించారు.కాగా గతంలో ఉప ఎన్నిక సందర్భంగా వరం గ ల్- ఖమ్మం- నల్గొండ నియోజక వర్గంలో 605 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం 894 కేంద్రాల కు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని జిల్లాల నుండి ప్రతిపాదనలు అందా యని ,రాజకీయ పార్టీల ప్రతిని ధుల సమ్మతితో ప్రతిపా దనలు పంపిం చేందుకు చర్యలు తీసు కుంటున్నట్లు ఆయన తెలి పా రు. ఈ సమావేశానికి డి ఆర్ ఓ దశరథ్,రాజకీయ పార్టీల ప్రతి నిధులు లింగస్వామి, పిచ్చయ్య, తెలు అన్న రవి, ముంతాజ్, ఎం ఐఎం నుండి ప్రతినిధి హాజరయ్యారు.

బాధితుల ఫిర్యాదులను పరిశీ లించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర



ప్రజా దీవెన, నల్లగొండ క్రైమ్: నల్గొండ జిల్లా పోలీసు కార్యాల యంలో సోమవారం నిర్వ హిం చిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్య క్ర మంలో జిల్లా ఎస్పీ ప్రజల ఫిర్యా దులను స్వీకరించి పరిశీ లించా రు.జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధి నుంచి వచ్చిన మొత్తం 28 మంది బాధితులు భూ వివాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు, ఆర్థిక లావాదేవీలు, సివిల్ వివాదాలు, దర్యాప్తు పురోగతికి సంబంధించిన అంశాలపై తమ ఫిర్యాదులను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రతి బాధితుడి సమస్యను విని ఎస్పీ, సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కేసుల ప్రస్తుత స్థితిని తెలుసుకున్నారు. చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా, నిర్దిష్ట కాలవ్యవధిలో ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై పురోగతిని పర్యవేక్షిస్తూ బాధితులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు సత్వర, పారదర్శక, బాధ్యతాయుత పోలీసింగ్ అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా విచారించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే, ప్రతి ఫిర్యాదుదారుడికి న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.

నూతన వృద్ధాప్య పెన్షన్లు ఇవ్వరా?



ప్రజా దీవెన, తుంగతుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం 4000 రూపాయల పెన్షన్ ఎప్పుడు ఇస్తారని, నూతనంగా వృద్ధులకు పెన్షన్ ఇవ్వరా అని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి రావడం కోసం అనేక వాగ్దానాలు చేసిన ప్రభుత్వ పెద్దలు మూడేళ్లయినా ఏ ఒక్క వాగ్దానాన్ని పూర్తిగా నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన ఆరోపించారు. 57 ఏళ్లు నిండిన ఎంతో మంది వృద్ధాప్య పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల ప్రకారం రెండు వేల పెన్షన్ సరిపోక ఎంతో మంది పెన్షన్ దారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే అన్ని రకాల పెన్షన్లను నాలుగు వేలు చేయాలని, వికలాంగులకు ఆరు వేల రూపాయలు ఇవ్వాలని, నూతనంగా వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మట్టిపెల్లి వెంకట్, ఎస్.కె. జాని, కోటమర్తి సైదులు పాల్గొన్నారు

సూర్యాపేట - తుంగతుర్తి మధ్య నూతన పల్లెవెలుగు నైట్-అవుట్ బస్సు

ప్రజా దీవెన, తుంగతుర్తి: తుంగతుర్తి మరియు అర్వపల్లి మండలాల ప్రయాణికుల సౌకర్యార్థం సూర్యాపేట డిపో ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం నుండి తుంగతుర్తికి నూతన పల్లెవెలుగు నైట్-అవుట్ బస్సు సర్వీసును ప్రారంభించినట్లు సూర్యాపేట డిపో మేనేజర్ వి. సునీత తెలిపారు. ఈ పల్లెవెలుగు సర్వీసు ప్రతిరోజూ రాత్రి 8:00 గంటలకు సూర్యాపేట న్యూ బస్ స్టేషన్ నుండి బయలుదేరి తిమ్మాపురం, అర్వపల్లి, వెలుగుపల్లి మీదుగా తుంగతుర్తికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఉదయం 5:00 గంటలకు తుంగతుర్తి నుండి బయలుదేరి వెలుగుపల్లి, అర్వపల్లి, తిమ్మాపురం మీదుగా ఉదయం 6:10 గంటలకు సూర్యాపేటకు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రయాణికులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 7382943819 నంబర్‌ను సంప్రదించవచ్చని డిపో మేనేజర్ వి. సునీత తెలిపారు.

నేడు శాలిగౌరారం మండలంలో విద్యుత్ సరఫరా కు అంతరాయం

శాలిగౌరారం, నవంబర్ 16 : శాలిగౌరారం లోని 132/33 కేవీ సబ్ స్టేషన్ లో మరమ్మత్తు పనులు చేపట్టనున్న నేపథ్యంలో 17 న మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని శాలిగౌరారం విద్యుత్ ఏఈ శ్రీధర్ తెలిపారు. మరమ్మత్తు పనుల కారణంగా సుమారు 5 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందన్నారు.మరమ్మత్తులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు, వ్యాపారులు ఈ విషయాన్ని గమనించి సహకరించగలరని కోరారు.

పంచారామాల దర్శనానికి నల్గొండ నుండి ప్రత్యేక బస్సులు

కార్తీక సోమవారం నాడు దర్శనం - మంగళవారం ఉదయానికి తిరిగి రాక



నల్గొండ, నవంబర్ 15 : కార్తీక మాసం సందర్భంగా పంచారామ క్షేత్రాల దర్శనం కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నల్గొండ డిపో నుండి ప్రత్యేక డీలక్స్ బస్సులను నడుపుతున్నట్లు నల్లగొండ డిపో మేనేజర్ మేరీ లావణ్య తెలిపారు. పరమ శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన అమరారామం (అమరావతి), సోమారామం (భీమవరం), క్షీరారామం (పాలకొల్లు), ద్రాక్షారామం (ద్రాక్షారామం), కుమారారామం (సామర్లకోట) క్షేత్రాలను ఈ యాత్రలో దర్శించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్తీక సోమవారాలందు ఈ క్షేత్రాలను దర్శించుకోవడం వల్ల మరింత పుణ్యఫలం లభిస్తుందని భక్తులు విశ్వసిస్తున్నారు.

ప్రతి ఆదివారం రాత్రి 7 గంటలకు నల్గొండ బస్టాండు నుండి బస్సులు బయలుదేరి, సోమవారం నాడు పంచారామాల దర్శనం చేయించి, మంగళవారం తెల్లవారుజామున తిరిగి నల్గొండకు చేరుకుంటాయని తెలిపారు.బస్సులు బయలుదేరు తేదీలు : 15-11-2026, 22-11-2026, 29-11-2026, 06-12-2026 (ఆదివారాలు)

చార్జీల వివరాలు : పెద్దలకు రూ. 2,000/-, పిల్లలకు రూ. 1,300/-

అదేవిధంగా అయ్యప్ప భక్తులకు శబరిమలై యాత్ర కొరకు, ప్రతి నెల పౌర్ణమికి అరుణాచల గిరిప్రదక్షణ కొరకు ఆర్.టి.సి. బస్సులు నడుపుతున్నట్లు ఆమె తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా అరుణాచల ప్రత్యేక బస్ 22-11-2026 ఆదివారం రాత్రి 8 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. 40 మంది ప్రయాణికులు ఉన్న యెడల మీ కాలనీ నుండే బస్సు బయలుదేరుతుందని, బస్సుకు సరిపడా ప్రయాణికులు ఉంటే ఏ పుణ్యక్షేత్రానికైనా ప్రత్యేక బస్సులు నడుపుతామని ఈ నెంబర్లకు 90634 05696, 99598 44918, కాల్ చేసి సంప్రదించాలని డిపో మేనేజర్ మేరీ లావణ్య తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయండి

టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షు డు కుందూరు దేవేందర్ రెడ్డి

ఈనెల 18న పట్టభద్రుల టిఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సూ ర్యాపేటకు రాక



ప్రజా దీవెన, సూర్యాపేట: ఈనెల 18వ తారీఖున సూర్యాపేటలో ఎస్వీకే గ్రాండ్ హోటల్ లో జరిగే నల్లగొండ, ఖమ్మం, వరంగల్, పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని సూర్యాపేట టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కుందూరు దేవేందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పట్టభద్రుల టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరమాస శ్రీకాంత్ గౌడ్ హాజరవుతున్నారని, అనంతరం జిల్లా గ్రంథాలయం లో పట్టభద్రులను, కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులను, వైద్యులతో కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించనున్నారని తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ శ్రేణులు, అభిమానులు, పట్టభద్రులు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రోహిత్ శర్మ వన్డే భవిష్యత్తుపై సందిగ్ధం



టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ భవిష్యత్తుపై ఇప్పుడు ఆసక్తికర చర్చ మొదలైంది. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచకప్‌లో అతడికి చోటు దక్కుతుందా? అన్న ప్రశ్నకు కొత్త చీఫ్ సెలక్టర్ ప్రజ్ఞాన్ ఓజా సమాధానం చెప్పాల్సి ఉంది. న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగు వన్డే ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ కేవలం 30 పరుగులే చేయడం ఈ చర్చకు కారణమైంది. ఫామ్ కోల్పోయినప్పటికీ ఆట (కెరీర్) కొనసాగించాలన్న అతడి పట్టుదల.. సెలక్టర్లకు చిక్కుముడిగా మారింది. జూనియర్ క్రికెట్ రోజుల నుంచి రోహిత్, ఓజా మధ్య స్నేహం ఉంది. గతంలో నేషనల్ క్రికెట్ అకాడమీలో జరిగిన శిక్షణ శిబిరాల సమయంలోనూ వారి అనుబంధం బలపడింది. ఇప్పుడు ఓజా సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో రోహిత్ విషయంలో కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యక్తిగత అనుబంధాన్ని పక్కనపెట్టి, ఆటగాడి ప్రస్తుత సామర్థ్యం, ప్రపంచకప్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు అప్పటి చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ సూచనతో ఓజా.. రోహిత్‌తో సమావేశమయ్యాడు. లార్డ్స్‌లో జరిగే మ్యాచ్ సందర్భంగా వన్డేలకు వీడ్కోలు పలికేందుకు సిద్ధంగా ఉన్నాడా? అన్నది తెలుసుకోవడమే ఆ భేటీ ఉద్దేశం. అయితే ఆ ప్రతిపాదనపై రోహిత్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. భారత క్రికెట్‌ను నడిపిస్తున్న వారిపై తన అసహనాన్ని కూడా వెల్లడించాడు. ఆ పరిణామాల తర్వాత అగార్కర్-రోహిత్ మధ్య వ్యక్తిగత సంబంధాలు దెబ్బతిన్నాయని వార్తలు వచ్చాయి. ఇప్పుడు అగార్కర్ స్థానంలో వచ్చిన ఓజాకు ఆ బాధ్యత బదిలీ అయింది. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో టాప్ ఆర్డర్ పదేపదే కుప్పకూలడంపై కోచ్ గౌతమ్ గంభీర్ ఆందోళన వ్యక్తం చేశాడు. అయితే భారత్ బౌలర్లు అద్భుతంగా రాణించడంతో సిరీస్‌ను 3-1తో గెలుచుకుంది. రోహిత్ కూడా సీమింగ్, బౌన్స్ ఉన్న పిచ్‌లపై ఇబ్బంది పడ్డాడు. వెస్టిండీస్‌తో స్వదేశంలో రాణించినప్పటికీ, న్యూజిలాండ్‌లో పరిస్థితుల్లో అతడి వైఫల్యాలు కొట్టొచ్చినట్టు కనిపించాయి. బౌన్స్‌ను ఎదుర్కోవడం, పవర్‌ప్లేలో నిలదొక్కుకోవడం అతడికి సవాలుగా మారాయి. కొన్ని సందర్భాల్లో ఆడాలన్న మనసుకు, శరీర స్పందనకు మధ్య సమన్వయం కనిపించడం లేదని విశ్లేషణ పేర్కొంది. ప్రపంచకప్‌కు ముందు భారత్ స్వదేశంలో మరో 6 వన్డేలు ఆడనుంది. ఆ తర్వాత 6 నెలల విరామం ఉంటుంది. శ్రీలంక, జింబాబ్వేలతో స్వదేశంలో జరిగే మ్యాచ్‌ల్లో రోహిత్ భారీ స్కోర్లు సాధించే అవకాశం ఉందని అంచనా. అయితే స్వదేశంలో పరుగులు చేసినంత మాత్రాన విదేశీ పరిస్థితుల్లోనూ రాణిస్తాడని సెలక్టర్లు భావించకపోవచ్చు. ఐపీఎల్ ఆడే ముందు దాదాపు మూడు నెలల విరామం ఉండటం కూడా అతడి ఫామ్‌పై ప్రభావం చూపుతుందా అన్న సందేహాలున్నాయి. రోహిత్ విజయ్ హజారే ట్రోఫీలో ఆడే అవకాశమూ ఉంది. అయితే దేశవాళీ వన్డే టోర్నీలో పాల్గొనడం కంటే, అక్కడి ప్రదర్శనలో స్థిరత్వం చూపించడం ముఖ్యం. ముఖ్యంగా కఠిన పరిస్థితుల్లో అతడి ఆటతీరును అంచనా వేయాల్సి ఉంటుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా భారత క్రికెట్‌కు సేవలందించిన ఆటగాడికి గౌరవప్రదమైన వీడ్కోలు దక్కాలన్న అందరి ఆశ. అయితే ప్రస్తుతానికి రోహిత్, ఓజా మధ్య బహిరంగంగా, స్పష్టంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచకప్ ప్రణాళికల్లో తన స్థానం ఏంటో రోహిత్‌కు తెలియాలి. అతడి ప్రస్తుత సామర్థ్యం, భవిష్యత్తు ప్రణాళికలపై సెలక్షన్ కమిటీకి కూడా స్పష్టత రావాలి. వచ్చే ఏడాది స్వదేశంలో జరిగే వన్డే సిరీస్‌లో చివరి మ్యాచ్ ముంబైలోని వాంఖడే స్టేడియంలో జింబాబ్వేతో జరగనుంది. రోహిత్ కెరీర్‌లో ఆ మ్యాచ్ కీలక మలుపుగా మారుతుందా? న్యూజిలాండ్ సిరీస్ తర్వాత ఈ ప్రశ్నకు ప్రాధాన్యం పెరిగింది.

49 ఏళ్ల తర్వాత కూడా నాతోనే

చిన్ననాటి బ్యాట్‌తో సేమ్ ఫోజులో.. ఫొటోను పంచుకున్న సచిన్



క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన పాత జ్ఞాపకాలను అభిమానులతో పంచుకున్నాడు. తాను తొలిసారి ఉపయోగించిన క్రికెట్ బ్యాట్‌ను 49 ఏళ్ల తర్వాత కూడా భద్రంగా దాచుకున్నానని తెలుపుతూ, సోషల్ మీడియాలో ఒక ప్రత్యేకమైన పోస్ట్ చేశాడు. తన చిన్ననాటి ఫొటోను, ఇప్పటి ఫొటోను జతచేసి పంచుకోవడం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ పోస్టులో, సచిన్ చిన్నప్పుడు బ్యాటింగ్ స్టాన్స్‌లో నిలబడి ఉన్న ఒక బ్లాక్ అండ్ వైట్ ఫొటో, అలాగే, అదే బ్యాట్‌తో ఇప్పుడు మళ్లీ అదే ఫోజులో నిల్చున్న ఫొటోను జత చేశాడు. "మొదటి బ్యాట్ సంగతి ఇది. 49 ఏళ్ల తర్వాత కూడా నాతోనే ఉంది!" అంటూ హిందీలో ఒక క్యాప్షన్ జోడించాడు. ఈ పోస్ట్ చూసిన అభిమానులు సచిన్ తన వస్తువులకు ఇచ్చే విలువను చూసి మురిసిపోతున్నారు. సరిగ్గా నవంబర్ 15న సచిన్ ఈ పోస్ట్ చేయడం మరో విశేషం. 1989లో ఇదే రోజున సచిన్ తన 16 ఏళ్ల 205 రోజుల వయసులో పాకిస్థాన్‌తో కరాచీలో జరిగిన టెస్టు మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. తన కెరీర్ ప్రారంభమైన రోజున, తన తొలి బ్యాట్‌ను గుర్తుచేసుకోవడం ద్వారా సచిన్ పాత జ్ఞాపకాల్లోకి వెళ్లాడు. ఈ పోస్ట్‌కు నెటిజన్ల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇది తమకు కూడా పాత రోజులను గుర్తు చేసిందని పలువురు కామెంట్లు చేస్తున్నారు.

రజత్ పటీదార్ విధ్వంసం

48 బంతుల్లోనే 135 పరుగులు.. రికార్డుల మోత!



సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మధ్యప్రదేశ్ కెప్టెన్ రజత్ పటీదార్ విధ్వంసకర బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. న్యూ చండీగఢ్‌లో అస్సాంతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 48 బంతుల్లోనే అజేయంగా 135 పరుగులు బాదాడు. అతని మెరుపు ఇన్నింగ్స్ ఫలితంగా మధ్యప్రదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 250 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ ఇన్నింగ్స్‌లో రజత్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. మొత్తం 13 సిక్సర్లు, 8 ఫోర్లు బాదాడు. కేవలం 41 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకోవడం విశేషం. దీంతో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ చరిత్రలో మధ్యప్రదేశ్ తరఫున సెంచరీ నమోదు చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. అంతేకాకుండా ఒకే ఇన్నింగ్స్‌లో 13 సిక్సర్లు బాది, రాష్ట్రం తరఫున ఈ టోర్నీలో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగానూ మరో ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. మధ్యప్రదేశ్ జట్టు 8వ ఓవర్లో 57 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్నప్పుడు రజత్ క్రీజులోకి వచ్చాడు. ఏమాత్రం సమయం తీసుకోకుండా అస్సాం బౌలర్లపై ఎదురుదాడికి దిగి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. మూడో నంబర్‌లో వచ్చిన శివాంగ్ కుమార్‌తో కలిసి అద్భుతమైన భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరిద్దరూ కలిసి కేవలం 62 బంతుల్లోనే 153 పరుగులు జోడించారు. ఇది ఈ టోర్నీలో మధ్యప్రదేశ్‌కు రెండో అత్యధిక భాగస్వామ్యం. తన ఇన్నింగ్స్ మొత్తంలో రజత్ కేవలం ఐదు డాట్ బాల్స్ మాత్రమే ఆడటం అతని దూకుడుకు నిదర్శనం. ఇటీవల గాయాల కారణంగా 50 ఓవర్ల ఫార్మాట్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్న రజత్, ఈ ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. నవంబర్ 19 నుంచి 29 వరకు దోహాలో జరగనున్న రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ కోసం ప్రకటించిన ఇండియా 'ఏ' జట్టుకు తొలుత వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అయితే, ఆ జట్టు నుంచి తాను తప్పుకుంటున్నట్లు బీసీసీఐకి తెలియజేశాడు. ఈ నేపథ్యంలో టీ20 ఫార్మాట్‌లో అతను ఇంతటి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఐసీసీ చైర్మన్‌గా జై షా

రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక



అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఛైర్మన్‌గా జై షా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండోసారి ఈ పదవికి ఆయన పేరును ఐసీసీ బోర్డు ఖరారు చేసింది. బాలి వేదికగా జరిగిన బోర్డు సమావేశాల్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో అంతర్జాతీయ క్రికెట్‌లో జై షా నాయకత్వం మరోసారి కొనసాగనుంది. 2024 ఆగస్టులో తొలిసారి ఐసీసీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన జై షా.. అదే ఏడాది డిసెంబర్ 1న బాధ్యతలు చేపట్టారు. అప్పటికి ఆయన వయసు 35 ఏళ్లు. ఐసీసీ చరిత్రలో ఈ పదవిని చేపట్టిన అత్యంత పిన్న వయస్కుడిగా నిలిచారు. అప్పటి ఛైర్మన్ గ్రెగ్ బార్క్‌లే మూడోసారి పోటీకి ఆసక్తి చూపకపోవడంతో జై షా ఒక్కరే బరిలో నిలిచారు. ఐసీసీకి నాయకత్వం వహించిన ఐదో భారతీయుడిగా గుర్తింపు పొందారు. గతంలో జగ్మోహన్ దాల్మియా, శరద్ పవార్, ఎన్.శ్రీనివాసన్, శశాంక్ మనోహర్ ఈ బాధ్యతలు నిర్వహించారు. 2028లో లాస్ ఏంజిల్స్ వేదికగా జరిగే ఒలింపిక్స్‌లో క్రికెట్ తిరిగి చోటు దక్కించుకోవడం ఐసీసీ ముందున్న ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. ఈ నేపథ్యంలో జై షా రెండోసారి ఎన్నిక కావడం నాయకత్వంలో కొనసాగింపునకు దోహదపడుతుందని ఐసీసీ భావిస్తోంది. క్రికెట్‌ను మరిన్ని దేశాలకు విస్తరించడం, మహిళల క్రికెట్‌ను బలోపేతం చేయడం, అసోసియేట్ సభ్య దేశాలకు అవకాశాలు పెంచడం, ఆటకు దీర్ఘకాలిక ఆదాయ వనరులు కల్పించడం వంటి అంశాలపై దృష్టి పెట్టనున్నారు. తనపై మరోసారి విశ్వాసం ఉంచిన ఐసీసీ బోర్డు సభ్యులకు జై షా కృతజ్ఞతలు తెలిపారు. సభ్య దేశాలతో కలిసి ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం కొత్త ప్రేక్షకులను ఆకర్షించేందుకు, యువతలో ఆటపై ఆసక్తి పెంచేందుకు గొప్ప అవకాశమని అభిప్రాయపడ్డారు. అభిమానులు, ఆటగాళ్లు, వాణిజ్య భాగస్వాముల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని క్రికెట్‌కు స్థిరమైన భవిష్యత్తును నిర్మించాల్సిన బాధ్యత ఉందన్నారు. జై షా కొనసాగింపును ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ రిచర్డ్ థాంప్సన్ స్వాగతించారు. ద్వైపాక్షిక సిరీస్‌ల ప్రాధాన్యాన్ని కాపాడుతూ అంతర్జాతీయ క్రికెట్ క్యాలెండర్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఐసీసీ స్వతంత్ర డైరెక్టర్ రోస్ రివాజ్ మహిళల క్రికెట్ అభివృద్ధికి మరిన్ని అవకాశాలు కల్పించాలని సూచించారు. జింబాబ్వే క్రికెట్ ఛైర్మన్, ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ తవెంగ్వా ముకుహ్లానీ.. 2027 పురుషుల వన్డే ప్రపంచకప్ ద్వారా ఆఫ్రికాలో క్రికెట్‌కు కొత్త అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ క్రికెట్ సమగ్రతను కాపాడటం, వివిధ ఫార్మాట్లకు ఆదరణ నిలబెట్టడం, అసోసియేట్ దేశాలకు ఉన్నతస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాలు పెంచడం కూడా ఐసీసీ ముందున్న ప్రాధాన్యాలుగా ఉన్నాయి.



పదేళ్ల సక్సెస్ సీక్రెట్ బయటపెట్టిన దిశా పటాని!

గ్లామరస్ పాత్రలతో .. వైవిధ్యమైన నటనతో యూత్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి దిశా పటాని. టాలీవుడ్ టూ బాలీవుడ్ అమ్మడి జర్నీ ఎంతో ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. తాజాగా ఈ బ్యూటీ బాలీవుడ్‌లో విజయవంతంగా పదేళ్ల ప్రయాణాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. 2016లో విడుదలైన -ఎమ్.ఎస్. ధోని: ది అన్‌టోల్డ్ స్టోరీ- చిత్రంతో సిల్వర్ స్క్రీన్‌కు పరిచయమైన అమ్మడు అటుపై -బాఘీ 2-, -మలంగ్-, -కల్కి 2898 ఏడీ- వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించింది. ఈ సందర్భంగా దిశా పటానీ ఓ ఇంటర్వ్యూలో మనసు విప్పి మాట్లాడారు. ఇండస్ట్రీలో పదేళ్ల అనుభవం తనలో తెచ్చిన మార్పులను.. ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులను దాటుకుని నేడు తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకోవడం వెనుక తనదైన శ్రమ దాగుందని పేర్కొన్నారు. -ఈ పదేళ్ల కాలం నన్ను ఒక వ్యక్తిగా మరింత పరిణతి చెందేలా చేసింది. ఇండస్ట్రీలో నా అంతర్గత శక్తిని.. నా ప్రవృత్తిని నమ్ముకోవడం నేను నేర్చుకున్నాను. స్క్రీన్ మీద నేను ఎంచుకునే పాత్రలైనా? బయట నేను ఫాలో అయ్యే ఫ్యాషన్ స్టైల్ అయినా? ఇప్పుడు పూర్తిగా నా మనసు చెప్పినట్టుగానే నడుచుకుంటాను- అని దిశ స్పష్టం చేశారు. అలాగే సెలబ్రిటీ హోదాలో నిత్యం పడే పబ్లిక్ స్క్రూటినీ.. విమర్శలపై కీలక వ్యాఖ్యలు చేసారు. -బయట ప్రజలు మన గురించి ఏమనుకుంటున్నారనే విషయాలు మన ఆత్మవిశ్వాసాన్ని ఎప్పుడూ దెబ్బ తీయకూడదు. ఇతరుల అభిప్రాయాలను పట్టించుకోకుండా మన పనిపై మనం దృష్టి పెట్టాలి. సానుకూల వాతావరణంలో ఉంటూ ప్రతిరోజూ కష్టపడితే అదే అసలైన బలాన్నిస్తుంది- అని తెలిపారు. అలాగే ఫిట్‌నెస్.. బ్యూటీ వెనుక ఉన్న అసలు రహస్యం గురించి ఓపెన్ అయ్యారు. -క్రమశిక్షణే నా విజయానికి పునాది. ఫిట్‌నెస్ అనేది కేవలం అందంగా కనిపించడం కోసం మాత్రమే కాదు. అది మన మనసుకు బలమైన రక్షణ కవచం లాంటిది. ప్రతిరోజూ చేసే హార్డ్‌వర్క్ మనలో అంతర్గత ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. నా ఈ కాన్ఫిడెన్స్ అంతా కేవలం నా డిసిప్లిన్ వల్లే వచ్చింది- అన్నారు.



తేజ సజ్జ ఎంగేజ్‌మెంట్

యంగ్ హీరో తేజ సజ్జ త్వరలోనే బ్యాచిలర్ లైఫ్ కు బైబై చెప్పబోతున్నారు. సోమవారం హైదరాబాద్ లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఆయన ఎంగేజ్‌మెంట్ సింపుల్ గా, గ్రాండ్ గా జరిగింది. అయితే ఈ వేడుకలో టాలీవుడ్ స్టార్ హీరోల ఎంట్రీ వైరల్ వ మారింది. ఇండస్ట్రీలో ఎంత ఎదిగినా తనకున్న పాత పరిచయాలకు తేజ ఎంత విలువ ఇస్తారో అర్థమవుతుంది. ఈ ఎంగేజ్‌మెంట్ కు రవితేజ, శ్రీకాంత్, రానా దగ్గుబాటి హాజరై తేజకు శుభాకాంక్షలు తెలిపారు. అయ్యప్ప మాలలో నల్లటి దుస్తుల్లో శ్రీకాంత్ రాగా, రవితేజ క్యాజువల్ చెక్స్ షర్ట్ లో, రానా వైట్ ట్రెడిషనల్ అవుట్ ఫిట్ లో కనిపించారు. వీరంతా ఈవెంట్ లోకి ఎంట్రీ ఇస్తున్న వీడియోలు, ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి.

ఐకాన్ స్టార్‌కు పెరుగుతున్న క్రేజ్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరమే లేదు. 'పుష్ప' సినిమాతో పాన్ ఇండియా రేంజ్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసిన బన్నీ క్రేజ్, ఇప్పుడు దేశాలు దాటి విదేశాలకు కూడా పాకింది. ఆయన డైలాగ్స్, యాక్టింగ్‌కు ఆడియన్స్ ఫిదా అవ్వడంతో బన్నీ మార్కెట్ వ్యాల్యూ ఊహించని స్థాయికి వెళ్లింది. దీంతో ఇప్పుడు బడా బడా కంపెనీలన్నీ తమ బ్రాండ్స్ ప్రమోట్ చేయమని అల్లు అర్జున్ ఇంటి ముందు క్యూ కడుతున్నాయి.ఆ వివరాలు చూద్దాం.. 'పుష్ప' సినిమాల తర్వాత అల్లు అర్జున్ తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీతో కలిసి 'రాకా' అనే సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ మూవీ చేస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా టైటిల్, బన్నీ కొత్త లుక్ బయటకు రావడంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ సినిమా మేనియా కూడా తోడవడంతో, బన్నీతో యాడ్స్ చేయడానికి కార్పొరేట్ కంపెనీలు పోటీ పడుతున్నాయి. బన్నీ తమ యాడ్‌లో కనిపిస్తే చాలు, తమ బిజినెస్ జెట్ స్పీడ్‌లో దూసుకుపోతుందని కంపెనీలు గట్టిగా నమ్ముతున్నాయి. అందుకే ఎంత ఖర్చయినా పెట్టడానికి వెనుకాడట్లేదు. ఇండస్ట్రీ టాక్ ప్రకారం, ఒక యాడ్ షూటింగ్ కోసం అల్లు అర్జున్ రోజుకు కనీసం రూ. 7 కోట్లకు పైగానే తీసుకుంటున్నాడాని టాక్. ఇక ఈ రేంజ్ రెమ్యూనరేషన్ కొందరు బాలీవుడ్ స్టార్ హీరోల కంటే కూడా ఎక్కువ కావడం విశేషం.



ట్రెడిషనల్ లుక్‌లో తళుక్కుమన్న సిమ్రాన్ చౌదరి

టాలీవుడ్‌లో 'ఈ నగరానికి ఏమైంది' సినిమాతో యూత్‌లో మంచి క్రేజ్ తెచ్చుకున్న తెలుగు హీరోయిన్ సిమ్రాన్ చౌదరి, సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా ఈ బ్యూటీ చీరకట్టులో తళుకుతళుకుమని మెరిసిపోతూ దిగిన కొన్ని సూపర్ ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. పండగ వైబ్స్ వచ్చేలా ఉన్న ఈ ట్రెడిషనల్ లుక్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటోలు చూసిన ఫ్యాన్స్ సిమ్రాన్ అందాన్ని పొగుడుతూ కామెంట్స్ పెడుతున్నారు.ఆ విశేషాలు చూద్దాం.. ఈ ఫోటోషూట్ కోసం సిమ్రాన్ ప్రత్యేకంగా డిజైన్ చేయించిన షాంపైన్-గోల్డ్ నెట్ చీరను కట్టుకుంది. ప్రముఖ డిజైనర్ లేబుల్ 'చాష్నీ' రూపొందించిన ఈ చీరపై చేతితో వేసిన సీక్విన్స్, పూసల వర్క్ చాలా గ్రాండ్‌గా ఉంది. ఇక దానికి మ్యాచింగ్‌గా హెవీ ఎంబ్రాయిడరీ ఉన్న స్లీవ్‌లెస్ బ్లౌజ్ వేసుకోవడంతో సిమ్రాన్ లుక్ మరింత అందంగా మారింది. సింపుల్ జ్యువెలరీ, నేచురల్ మేకప్‌తో ఆమె అచ్చం దేవకన్యలా మెరిసిపోయింది. క్లాసికల్ డ్యాన్సర్‌గా, మోడల్‌గా కెరీర్ మొదలుపెట్టిన సిమ్రాన్, 2014లో 'హమ్ తుమ్' సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. కానీ 'ఈ నగరానికి ఏమైంది' సినిమాలో శిల్ప పాత్రతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత బొంభాట్, చెక్, పాగల్, సెహరి, లవ్ మీ లాంటి సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకుంది.



Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA